ప్రారంభమైన పెన్‌గంగ జాతర




సమాధుల వద్ద పూజలు చేస్తున్న భక్తులు

దక్షిణ భారతదేశంలో అతి పెద్ద జాతరగా పేరుగాంచిన మహారాష్ట్ర-తెలంగాణ సరిహద్దున గల పెన్ గంగా జాతర బుధవారం పౌర్ణమి రోజున ఘనంగా ప్రారంభమైంది. భక్తుల పుణ్య స్నానాలు, నైవేద్యాలు.. సందడితో జాతర హోరెత్తింది.

20

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



ఆదిలాబాద్
20
గురువారం 4 జనవరి 2018

బుధవారం గరిష్ఠ ఉష్ణోగ్రత 29.4 । కనిష్ఠం 7.0



'హైటెక్' ఎలక్షన్



- గ్రామ పంచాయతీ ఎన్నికలకు ప్రత్యేక పోర్టల్
- ఆన్‌లైన్‌లోనే సభ్యుల నామినేషన్ నమోదుకు అవకాశం
- ఉద్యోగుల విధులు, వార్డుల కేటాయింపులు అంతా ఆన్‌లైన్‌లోనే
- పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు
- త్వరలోనే ఉమ్మడి జిల్లా ఎంపీడీవోలకు ప్రత్యేక శిక్షణ

8





2018లో జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికలను గడువు లోగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ముందస్తు కసరత్తు మొదలు పెట్టింది. ఇప్పటికే గత అక్టోబరు 24, 25 తేదీల్లో రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ వి.నాగిరెడ్డి జిల్లాలో పర్యటించి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పంచాయతీలు, వార్డులు, అవసరమైన బ్యాలెట్ బాక్సులు, బడ్జెట్, సమస్యాత్మకమైన పంచాయతీలు, సిబ్బందిపై కమిషనర్ సమీక్షించారు. మరో నాలుగైదు మాసాల్లో నిర్వహించే పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే సభ్యులు తమ నామినేషన్లను ఆన్‌లైన్‌లోనే నమోదు చేసుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించనుంది. కాగా, ఎన్నికల ప్రక్రియ అంతా ఆన్‌లైన్ ద్వారానే చేపట్టనున్నారు. ఎన్నికల్లో విధులు నిర్వహించే ఉద్యోగుల వివరాలు, విధుల కేటాయింపు, వార్డుల విభజన, ఓటర్ల జాబితా, ఏ వ్యక్తి ఏ పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉన్నది తెలిసిపోనున్నది.



బజార్‌హత్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం ఇదే..

ప్రభుత్వ ఆస్పత్రిలో..

పెరుగుతున్న డెలివరీల సంఖ్య

- గర్భిణులకు భరోసాగా బజార్‌హత్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
- పీహెచ్‌సీకి అనుబంధంగా 'అమ్మఒడి' 102 వాహనం
- నెలలో 22 నుంచి 25 మందికి పీహెచ్‌సీలో డెలివరీలు
- ప్రతీ 9వ తేదీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు

9

కోట్ల రూపాయల వ్యయం..

ఫలితం శూన్యం!

- ఫలితాలు ఇవ్వని సోలార్ వాటర్ హీటర్లు
- వృథా అవుతున్న ప్రజాధనం
- చన్నీళ్ల స్నానంతో విద్యార్థులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని ఐటీడీఏ అధికారులు

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సోలార్ వాటర్ హీటర్లు



(మధ్యపేజీల్లో..)



- చిత్ర పటం, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళి
- జనవరి 3ను ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించాలని నాయకుల డిమాండ్

ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి

5



పశువులకు టీకాలు వేస్తున్న వైద్యుడు

గాలికుంటు నివారణకు టీకాలు

జిల్లాలో కొనసాగుతున్న వైద్య శిబిరాలు

నెన్నెల, జనవరి 3: ప్రస్తుత పరిస్థితుల్లో పశువులకు గాలికుంటు వ్యాధి (ఫూట్ అండ్ మౌత్ డిసీజ్) సోకుతున్నది. దీంతో గేదెలు, ఆవులు పాలు సరిగ్గా ఇవ్వడం లేదు. పనులు చేసే ఎడ్లు నీరసించిపోతున్నాయి. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ వ్యాధి కారణంగా గొర్రెలు, మేకలూ మృత్యువాతపడి గొల్లకుర్మలు ఆర్థికంగా దెబ్బతింటున్నారు. కాగా, ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటే ఈ వ్యాధిని అరికట్టవచ్చని పశువైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం తరపున ఉచితంగా టీకాలు వేస్తున్నారు. ఇందుకోసం మంచిర్యాల జిల్లావ్యాప్తంగా జనవరి1 నుంచి పశువైద్యశిబిరాలు ప్రారంభించారు. ఇవి ఈ నెల 13 వరకు కొనసాగుతాయనీ, రైతులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

గాలి కుంటు వ్యాధి లక్షణాలు..

చీలిక గిట్టెలున్న పశువులకు సంక్రమించే వ్యాధుల్లో గాలికుంటు వ్యాధి ఒకటి.

- ఆఫ్తో వైరస్ వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. ఒక పశువు నుంచి మరో దానికి అతి తక్కువ కాలంలో సంక్రమిస్తుంది. ఈ వ్యాధితో మరణాల శాతం తక్కువే అయిన ప్పటికీ పశువుల్లో ఉత్పాదక సామర్థ్యం తగ్గి పోతుంది. గాలికుంటు వ్యాధి యుక్త వయసు ఉన్న పశువులు, బలహీనంగా ఉండి వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండే పశువుల్లో, దేశావాళీ పశువుల కంటే సంకర జాతి పశు వుల్లో ఎక్కువగా కనిపి స్తుంది.
- వ్యాధి సోకినప్పుడు పశువుల శరీర ఉష్ణోగ్రత 104 నుంచి 106 డిగ్రీల సెల్సియస్ ఉంటుంది.
- నోటి ఇఫిథీలియం, పళ్ల చిగుళ్లు నాలుక లోపలి ప్రాంతాల్లో బొబ్బలు ఏర్పడి అవి 24 గంటల్లో చితికి పోవడం వల్ల పశువులకు నొప్పి వస్తుంది. దీంతో పశువులు మేత ముట్టవు. నోటి నుంచి చొంగ కారుతుంది.
- గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడి ఆ తర్వాత చితికి పోవడం వల్ల నొప్పితో పశువులు కుంటుతాయి.
- పొదుగుపై బొబ్బలు ఏర్పడి ఒక్కో సారి పొదుగుకు వాపు వస్తుంది.
- వ్యాధి సోకిన పశువు పాలను దూడలకు పడితే అవి చనిపోయే ప్రమాదముంది.. ఎడ్లు వ్యవసాయ పనులు చేయలేక నీరసించి పోతాయి. పాడి పశువుల్లో పాల దిగుబడి అకస్మాత్తుగా తగ్గిపోతుంది. చూడి పశువుల్లో గర్భస్రావాలు జరుగుతాయి.
- పశువుల్లో రక్తహీనత కనిపిస్తుంది.. శ్వాస కష్టంగా పీల్చుతూ, రొప్పుతూ, ఎండ వేడిమి తట్టుకోలేక నిరసిస్తాయి.

చికిత్స ఇలా..

- వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరుచేసి సత్వరం చికిత్స చేయించాలి.
- పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో పుండ్లను శుభ్రం చేయాలి. అనంతరం నోటి పుండ్లకు బోరోగ్లిజరిన్, కాలి పుండ్లకు జింక్ ఆక్సైడ్, లోదాక్సిన్, హిమాక్స్‌లాంటి అయింట్‌మెంట్లు పూయాలి. ఈగలు వాలకుండా వేప నూనె, నిమ్లింట్ లాంటి మందులను రాయాలి.
- 3 నుంచి 5 రోజుల పాటు అంటీబయాటిక్స్ మందులను వాడాల్సి ఉంటుంది.

వ్యాధి సోకకుండా..

- గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు మొదటి సారి 3 నెలల వయసులోనే వేయిం చాలి. ఆ తర్వాత ఏటా క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి.
- ఆంబోతులు, దున్నల వీర్యం ద్వారా వ్యాధి వ్యాపిస్తుంది. అందువల్ల వ్యాధిసోకిన వాటిని సుమారు 3 నెలల పాటు సంపర్కానికి వినియోగించకూడదు.
- పాలుతాగే దూడలకు వ్యాధి సోకకుండా ఉండేదుకు దూడలు కలుషితమైన పాలు తాగకుండా జాగ్రత్త పడాలి. మనుషులు సైతం ఆ పాలను మరగకాచాకే వినియోగించాలి.
- పశువుల కొట్టాలను క్రిమి సంహారక మందులతో కాకుండా సోడియం హైడ్రాక్సైడ్, 2 శాతం ఫార్మబిన్, 4 శాతం సోడియం కార్బోనేట్ వంటి మందులతో శుభ్రం చేయడం వల్ల వైరస్ నశిస్తుంది.

పశువులకు టీకాలు తప్పకుండా వేయించాలి..



గాలికుంటు వ్యాధిని ముందు జాగ్రత్తతో నివారించవచ్చు. ఈ వ్యాధి సోకకుండా ఉండేందుకు పశు వులకు తప్పకుండా టీకాలు వేయించాలి. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం. జిల్లాలో జనవరి 13 వరకు టీకాల కార్యక్రమాలు కొనసాగుతుంది. మూడు నెలలు నిండిన పశువులన్నింటికీ తప్పనిసరిగా టీకాలు వేయించాలి.

డాక్టర్ దిలీప్,
పశువైద్యులు, నెన్నెల

యాసంగి వరికి 'జింకే' జీవం

జింకు లోపాన్ని నివారిస్తేనే అధిక దిగుబడులు

భైంసా జనవరి 3: పూర్వ ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని పంట భూముల్లో జింకు లోపం ఎక్కువగా కనిపిస్తున్నది. రైతులు సేంద్రియ ఎరువులకు బదులు రసాయన ఎరువులను విచ్చలవిడిగా వాడుతున్నందున నానాటికీ భూములు నిస్సారంగా మారుతున్నాయి. ముఖ్యంగా జింక్, బోరాన్, మెగ్నీషియం లాంటి సూక్ష్మ పోషకాల లోపం ఏర్పడుతున్నది. అందులోనూ వరిలో జింకు లోపం వల్ల దిగుబడి తగ్గుతుంది. అందువల్ల రైతులు జింకులోటును పూడ్చుకోవాల్సిన అవసరముందని నిర్మల్ జిల్లా వ్యవసాయాధికారి అమరేష్ కుమార్ చెబుతున్నారు. ఇందుకోసం ఆయన అందిస్తున్న సూచనలు, సలహాలు యథాతథంగా..

- మురుగునీరు బయటకు వెళ్లే పరిస్థితి లేనప్పుడు, వాతావరణంలో ఉష్ణోగ్రతలు పడిపోయినప్పుడు జింకు లోపం బయటపడుతుంది.
- నేలలో జింక్ లోపం ఉంటే వేసిన ఎరువులు పనిచేయక వృథా అవుతాయి. పంట పెరుగుదల సరిగ్గా ఉండదు. దిగుబడులు తగ్గిపోతాయి. వరి పిలకలు తక్కువగా, ఆలస్యంగా వస్తాయి. లేత ఆకుల ఈనెల మధ్యభాగం పసుపు రంగులోకి మారిపోతుంది. పైరు కృషించి, గిడసబారి కనిపిస్తుంది.
- వరిలో జింకు లోపానికి ప్రధాన కారణం సేంద్రియ ఎరువులను వినియోగించకపోవడమే! అందువల్ల ప్రతి రైతూ వరి సాగుకు ముందు పెసర, అలసంద, జీలుగ లాంటి పచ్చిరొట్ట పైర్లను సాగుచేసి నేలలో కలియదున్నాలి.
- జింకు లోపం నివారణకు వర్మీకంపోస్టు, పశువుల పేడ, ఇతరత్రా సేంద్రియ ఎరువులను పంటలకు అందించాలి. వీలు కానప్పుడు వరి నాటే ముందు ఎకరాకు 20 కిలోల వంతున జింక్ సల్ఫేట్‌ను చల్లుకోవాలి.



జింక్ సల్ఫేట్ బస్తాలు

ఎట్టిపరిస్థితుల్లోనూ జింక్ సల్ఫేట్‌ను, భాస్వరపు ఎరువులతో కలిపి వేయరాదు. జింక్ సల్ఫేట్ వేయడానికి ముందు, తర్వాత రసాయన ఎరువులు వేసేందుకు కనీసం నాలుగురోజుల వ్యత్యాసం ఉండేలా చూసుకోవాలి.

- వరి నాటకముందు వేయలేకపోతే పైరు పై జింక్ సల్ఫేట్‌ను పిచికారీ చేయవచ్చు. నాటు పూర్తయిన 20 రోజులకు ఒకసారి, వారం వ్యవధిలో మరోసారి ఎకరానికి 400 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పదిహేను రోజుల వ్యవధిలో మరో దఫా పిచికారీ చేయాలి.

యాసంగి సాగులో రైతన్న బిజీ

మంచిర్యాల జిల్లాలో ఊపందుకున్న నాట్లు

దండేపల్లి, జనవరి 3: యాసంగి సాగులో రైతన్నలు బిజీగా మారిపోయారు. మంచిర్యాల జిల్లాలో బోర్లు, బావుల కింద వరినాట్లు ముమ్మరం చేశారు. వారం రోజులుగా ఎక్కడ చూసినా తెల్లారింది మొదలు చీకటి పడేదాకా పొలాల్లోనే దున్నుతూ, రొప్పుతూ, ఇతరత్రా పనులు చేస్తూ కనిపిస్తున్నారు. వరినాట్లతో వ్యవసాయ కూలీలకు చేతి నిండా పని దొరికింది. ఖరీఫ్‌లో వరికి దోమపోటు కారణంగా నష్టపోయిన అన్నదాతలు, యాసంగిలోనైనా గట్టెక్కుతామనే ఆశలో ఉన్నారు. దండేపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో పనుల్లో నిమగ్నమైన రైతుల దృశ్యమాలికే ఇది.



చింతపల్లి శివారులో ట్రాక్టర్‌తో పొలం సిద్ధం చేస్తున్న రైతు



తానిమడుగులో జంబు కొడుతున్న రైతు



రెబ్బనపల్లి శివారులో నాటు వేస్తున్న మహిళలు

భైంసాలో దళితుల ఆందోళన

మహారాష్ట్ర సర్కారుకు వ్యతిరేకంగా ప్రదర్శనలు ▸ రోడ్డుపై ర్యాలీ, రాస్తారోకో ▸ ఆర్డీవోకు వినతి

భైంసా, జనవరి 3: మహారాష్ట్రంలోని పుణేలో సోమవారం భీమా - కోరెగావ్ యుద్ధం 200వ వార్షికోత్సవం సందర్భంగా అక్కడి దళితులపై జరిగిన దాడి ఘటనను నిరసిస్తూ భైంసాలో బుధవారం ముథోల్ నియోజకవర్గ దళిత సంఘాలు ఆందోళనలు నిర్వహించారు. ఉదయం బస్టాండ్ ఎదుట అంబేద్కర్ యువజన సంఘాలు, మాల మహానాడు శ్రేణులు, సంత్ సైనిక్ దళ్, రిపబ్లికన్ స్టూడెంట్ యూనియన్ శ్రేణులు భేటీ అయి దళితులకు పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసిన అనంతరం వారందరూ ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి మహారాష్ట్ర సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్డీవో రాజుకు వినతి పత్రాన్ని అంద చేశారు. బస్టాండ్ ఎదుటి ప్రధాన రోడ్డుపై రాస్తా రోకో చేపట్టారు. దీంతో వాహనాలకు స్తంభించా యి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమా వేశంలో ఆయా దళిత సంఘాల ప్రతినిధులు మా ట్లాడుతూ.. మహారాష్ట్ర సర్కార్ అనుసరిస్తున్న దళిత వ్యతిరేక విధానాలతోనే దాడులు జరుగుతు న్నాయని ఆరోపించారు. ఆందోళనల్లో భాగంగా దిష్టిబొమ్మను తయారు చేస్తున్న మాల మహానాడు జిల్లా ప్రతినిధి భీంరావ్ డొంగ్రేతో పాటు మరొకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ చర్యను అదుపులోనున్న వారిని వదిలిపెట్టాలని డిమాండ్ చేస్తూ పోలీసు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఆందోళనకారులను సముదాయించి శాంతపరచేందుకు భైంసా డీఎస్పీ అందె రాములు, భైంసా టౌన్ ఎస్ఐలు నజీర్ అహ్మద్, పున్నంచందర్‌లు విఫలయత్నం చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారటాన్ని గుర్తించిన పోలీసు అధికారులు అదుపులో నున్న ఆందోళనకారులను విడిచిపెట్టడంతో సమస్య సద్దుమణిగింది.


రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న దళిత సంఘాల నాయకులు


ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

క్రైం వార్తలు

అప్పుల బాధ తాళలేక యువరైతు ఆత్మహత్య

ముథోల్, జనవరి 3: నిర్మల్ జిల్లా ముథోల్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన సింగేటి మల్లయ్య(32) అనే యువరైతు అప్పుల బాధ భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ముథోల్ పోలీసులు తెలిపారు. పోలీసులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. మల్లయ్య తనకు ఉన్న ఐదు ఎకరాల భూమిలో పంటల సాగు కోసం నాలుగు బోర్లను వేయించాడు. దురదృష్టవశాత్తు వేసిన బోర్లు ఫెయిల్ అవడంతో పాటు గత రెండేళ్ల నుంచి ఆశించిన స్థాయిలో పంటలు దిగుబడి రాలేదు. దీంతో ప్రైవేటు అప్పులు సుమారు 3లక్షల వరకు ఉన్నాయి. మల్లయ్య మనస్తాపానికి గురై జీవితంపై విరక్తి చెంది గత సంవత్సరం డిసెంబర్ 31న పురుగుల మందు తాగాడు. ఈ విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కంది కుప్ప దగ్ధం : రూ.50 వేల నష్టం

ఇంద్రవెల్లి, జనవరి 3 : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని అంజి గ్రామానికి చెందిన రైతు చందులే పండిత్‌కు చెందిన కంది కుప్ప దగ్ధమైంది. రైతు పండిత్ తెలిపిన వివరాల ప్రకారం.. తన చేనులో కంది కోసి కుప్ప పోశారని.. బుధవారం తెల్లవారుజామున వెళ్లి చూడగా పూర్తి కాలిపోయి ఉందని వాపోయాడు. ఈ కంది విలువ రూ.50వేలు ఉంటుందన్నారు. ఈ మేరకు తహసీల్దార్‌కు, ఎస్సైకి సమాచారం ఇచ్చి, తనకు నష్ట పరిహారం ఇప్పించాలని బాధిత రైతు కోరారు.


ఇంద్రవెల్లి మండలంలో దగ్ధమైన కంది పంట

ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత


పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

నర్సాపూర్ (జి) , జనవరి 3 : నిర్మల్ జిల్లా నర్సాపూర్ మండలంలోని ఆర్లి గ్రామం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ రాంనర్సింహారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ఆర్లి గ్రామం వద్ద ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో మాటు వేసి పట్టుకున్నామన్నారు. ఈ దాడిలో సిబ్బంది మహిపాల్, రామారావు పాల్గొన్నారు.

మామడ , జనవరి 3 : నిర్మల్ జిల్లా మామడ మండలంలోని ఆదర్శ నగర్ గ్రామం నుంచి బుధవారం అక్రమంగా ఎటువంటి అనుమతులు లేని ఇసుక ట్రాక్టర్‌ను మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ప్రవళిక పట్టుకొని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎవరైనా అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమె హెచ్చరించారు.

విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి

ఖానాపూర్ రూరల్ , జనవరి 3 : నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని బాదన్‌కుర్తి గ్రామ శివారులో విద్యుత్ షాక్ తగిలి ఎద్దు మృతి చెందింది. మరిసెట్టి రాజన్నకు చెందిన ఎద్దు వ్యవసాయ ట్రాన్స్ ఫార్మర్ వద్ద మేస్తుండగా విద్యుత్‌షాక్ తగిలింది.


మృతి చెందిన ఎద్దు



బంగారం ధరలు

బిస్కెట్ బంగారం	10 గ్రాములకు	రూ.30,750
ఆర్నమెంట్ బంగారం	10 గ్రాములకు	రూ. 30,250
వెండి	10 గ్రాములకు	రూ. 410



సినిమా గైడ్ ఆదిలాబాద్, నిర్మల్

ఆదిలాబాద్

గణేష్	: 10(టెన్)
మహేశ్వరీ	: ఎంసీఏ
నటరాజ్(70ఎంఎం)	: ఆక్సిజన్
నటరాజ్ డీలక్స్ (35 ఎంఎం)	: సప్తగిరి ఎల్ఎల్‌బీ

నిర్మల్

తిరుమల	: హలో
వెంకటేశ్	: టైగర్ లిటర్స్
నారాయణ	: ఎంసీఏ

చదువుతో పాటు సామాజిక సేవలోనూ పాల్గొనాలి

తలమడుగు, జనవరి 3: విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని తహసీల్దార్ అతీకొద్దిన్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులు ఫుడ్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేశారు. అనంతరం వి ద్యార్థులు తయారు చేసిన ఆహార పదార్థాలను ఎంపీడీవో సునీత, ఎస్సై సుబ్బా రావ్, ఎంఈవో కౌసల్య, పాఠశాల ప్రధా నోపాధ్యాయుడు పద్మాకర్‌రెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ ఆశన్న, నీలగిరి అశోక్, ఉపాధ్యాయులు కొనుగోలు చేశారు.

వార్తలు

గోడపై ఉపాధి హామీ పనుల వివరాలు

నేరడిగొండ, జనవరి 3: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుకు ప్రభుత్వం కోట్లాది నిధులు ఖర్చు చేస్తున్నా పారదర్శకత కరువైందని విమర్శలున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రతీ గ్రామ పంచాయతీ చేపట్టిన పనుల వివరాలను గ్రామాల్లో గోడపై వివరాలు రాసి పెడుతున్నారు. పనుల్లో నాణ్యత పారదర్శకత ప్రమాణాలు పాటించేందుకు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలోని సమాచార గోడలపై ఉపాధి వివరాలు రాస్తున్నట్లు డీఆర్ డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ రాథోడ్ రాజేశ్వర్ పేర్కొన్నారు.

అయ్యప్ప స్వాములకు ముస్లిం సోదరుడి భిక్ష

సిరికొండ, జనవరి 3: కుల మతాలకు అతీతంగా సిరికొండ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు, ముస్లిం సోదరుడైన ఎస్కే బషీర్ శ్రీ అయ్యప్ప స్వాములకు భిక్ష నేడు(గురువారం) ఏర్పాటు చేసినట్లు సిరికొండకు చెందిన అయ్యప్ప గురు స్వాములు అశిల్ల దత్తు, లక్కం మల్లేష్‌లు తెలిపారు. భిక్షకు అయ్యప్ప స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

సిరికొండ, జనవరి 3: ఆదివాసీ ప్రధాన్ పురోహిత్ సమాజ సంఘం సిరికొండ మండల నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుమ్రం జంగు బాబు, ఉపాధ్యక్షుడిగా పెందూర్ ఆనంద్ రావ్, ప్రధాన కార్యదర్శి చేతన్ మారుతి, కార్యదర్శి చిత్రం రాజారాం, కోశాధికారి తుర్క గోపాల్, ముఖ్య సలహాదారులుగా సోనేరావ్, చిర్క బాలాజీలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు.

మాల సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నేరడిగొండ, జనవరి3: మాల సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను బుధవారం దళిత కవి జీఆర్ కుర్మే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు బొడఅడెల్లు, అనుపట్ల సంజీవ్‌కుమార్, మద్దెల నారాయణ, లస్మన్న, నారాయణ స్వామి, నక్క మహేందర్, పట్టెపు లక్ష్మణ్, సంటెన్న తదితరులు పాల్గొన్నారు.



మాల సంఘం క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జీఆర్ కుర్మే

ఎస్సీ, ఎస్టీలకు న్యాయం చేస్తాం

» ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు నీలాదేవి

సిరికొండ,జనవరి3: ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్న హరిజన గిరిజనులకు తనవంతుగా అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తూ వారికి అందు బాటులో ఉంటానని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు కుస్రం నీలాదేవి(పెందూర్ నీలాబాయి) అన్నారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలిగా నియమితులైన సందర్భంగా బుధవారం ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి తాను పార్టీలో పని చేస్తున్నానని తెలంగాణ రాష్ట్రం కోసం పార్టీలో ఉండి ఉద్యమం చేపట్టానని, సీనియర్‌లను ఉద్యమ నేతలను పార్టీ ఎన్నడూ మరువదని సూచించారు. దానికి నిదర్శనం తానేనని పేర్కొన్నారు. 1995లో తాను గుడిహత్నూర్ జడ్పీటీసీ సభ్యురాలిగా ఎన్నిక కావడం జరిగిందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమం ఊపందుకోవడం తెలుగు దేశం పార్టీ చూపిన వివక్ష కారణంగా 2001లో టీఆర్ఎస్ అప్పటి జిల్లా అధ్యక్షుడు కమలాధర్ గుప్తా ఆధ్వర్యంలో పార్టీలో చేరి తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమించానని గుర్తుచేసుకున్నారు. రెండు సార్లు బోథ్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి అసెంబ్లీ టికెట్ కోసం ప్రయత్నించానని, ఒక సారి జడ్పీటీసీ టికెట్‌ను ఆశించానని అయినప్పటికీ అధిష్టానం తనకు అవకాశం ఇవ్వలేదన్నారు. తాను ఎలాంటి నిరాశ నిస్పృహలకు గురి కాలేదన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం అంకిత భావంతో టీఆర్ఎస్‌లో ఉండి పోరాడానని పేర్కొన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నామినేటెడ్ పదవులను మహిళలకు ఇస్తున్నారని, అందులో మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులు గిరిజన మహిళలకు రిజర్వ్ చేయడంతో ఇచ్చోడ, మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఆశించడం జరిగిందన్నారు. పార్టీ తనను మరువకుండా ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యురాలిగా నియమించిందని ఆమె పేర్కొన్నారు. తనకు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలిగా పదవి ఇచ్చినందుకు జిల్లా మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎంఎల్‌సీలకు, డెయిరీ చైర్మన్ భూమా రెడ్డి తదితరులకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని హరిజన, గిరిజనులకు జరుగుతున్న అన్యాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఇందులకు ప్రజలు సహకరించాలన్నారు.

నీలాబాయికి సన్మానం..



ఉద్యమ సమయంలో నీలాదేవి(ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్, జనవరి3: 2001 సంవత్సరం నుంచి ఉద్యమమే ధ్యేయం గా తెలంగాణ రాష్ట్రమే లక్ష్యంగా టీఆర్ఎస్ పార్టీలో ఉన్న నీలాబాయికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలిగా నియమించినందుకు బుధవారం మావల మండల కేంద్రంలో ఆమెను పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మావల సర్పంచ్ రఘుపతి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ప్రతీ ఒక్కరికి ముఖ్యమంత్రి కేసీఆర్ న్యాయం చేశారన్నారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు నల్లరాజేశ్వర్, ఎంపీడీసీ దమ్మపాల్, మండల ఉపాధ్యక్షుడు రాజు, సభ్యులు సూర్యబాను పాల్గొన్నారు.

'ఆదివాసీ ఆత్మీయ గోష్టికి తరలిరండి'

తలమడుగు, జనవరి 3: ఈ నెల 7న జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్ చౌక్‌లో గల ఉర్దూ భవన్‌లో నిర్వహిస్తున్న ఆదివాసీ ఆత్మీయ గోష్టికి అధిక సంఖ్యలో గిరిజనులు తరలి రావాలని తెలంగాణ రైతాంగ సమితి జిల్లా కన్వీనర్ నైతం సూర్యభాన్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక పోరాటాలతో గిరిజనులకు రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్‌లో రిజర్వేషన్ కల్పించారన్నారు. కాని పాలకులు వీటిని ఏనాడు అమలు చేయలేదని మండిపడ్డారు. భూ స్వాములు, పెట్టుబడి దారులు బహుళ జాతి కంపెనీల ప్రయోజనాల కోసం పాలకులు వీటికి తూట్లు పొడుస్తున్నారు. పీసా చట్టం, 1/70 చట్టం, అటవీ హక్కుల చట్టం, కనుమరుగవుతుందన్నారు. టీఆర్ఎస్ లంబాడాలే ఎస్టీలనే తీరుగా వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత టీఆర్ఎస్ ప్రభుత్వం లంబాడీల సమస్య కేవలం ఉద్యోగ అవకాశాలకు సంబంధించింది కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు సాయన్న, ఎడ్ల ఆశన్న, రాహుల్, నైతం బాలు తదితరులు పాల్గొన్నారు.

హిమని అందాల కోసాయి

చుట్టూరా కొండలు, కోనలు.. ఆ ప్రకృతికి పొగమంచు తోడైతే ప్రకృతి అందాలు ఎంతో మధురానుభూతిని కలిగిస్తుంది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి 30కి.మీ.ల దూరంలో ఉన్న కోసాయి పల్లె సమీపంలో ఉదయం వేళ ఈ హిమని అందాలు కనువిందు చేస్తున్నాయి. ఈ పచ్చని సోయగాలకు 'హిమ' సొగసుల అందాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



కొండల మధ్య నుంచి వస్తున్న రైలు



కోసాయి సమీపంలోని ఓ గిరిజన గ్రామం అందాలు

'ఉద్యోగ విరమణను 60 ఏళ్లకు పెంచాలి'

తలమడుగు, జనవరి 3: ప్రభుత్వ ఉద్యోగుల పదవి విరమణ వయసు 60 సంవత్సరాలకు పెంచాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లా రత్నాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం తలమడుగు మండల పరిషత్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఆ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలన్నారు. విధానం రద్దు అయ్యే వరకు పీఆర్‌టీయూ సంఘం నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. అనంతరం సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అతీకొద్దిన్, ఎంపీడీవో సునీత, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ప్రకాశ్ గౌడ్, సుఖ్‌దేవ్, మహేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇంటర్వ్యూ

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



ఆత్రంభాస్కర్, డీటీడీవో, బోథ్ డివిజన్

ఆంధ్రజ్యోతి: పదో తరగతి పరీక్షలకు ఎలా సిద్ధం చేస్తున్నారు?

డీటీడీవో: ఉదయం సాయంత్రం వేళల్లో ఇప్పటి నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: పదో తరగతి సిలబస్ పూర్తయ్యిందా?

డీటీడీవో: 90శాతం పూర్తయ్యింది. మిగిలిన సిలబస్ వారం రోజుల్లో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: బోథ్ డివిజన్ నుంచి ఎంత మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు?

డీటీడీవో: 467 మంది విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవుతున్నారు.

ఆంధ్రజ్యోతి: పరీక్ష కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారా?

డీటీడీవో: పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: వెనుకబడిన విద్యార్థులపై ఎలాంటి శ్రద్ధ తీసుకుంటున్నారు?

డీటీడీవో: చదువుల్లో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం.

- నేరడిగొండ

ఆదిలాబాద్

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోండి

ఆదిలాబాద్ క్రైం, జనవరి 3: తెలంగాణ కార్మిక సంక్షేమ మండలి ద్వారా సంక్షేమ పథకాల్లో భాగంగా వివిధ వాణిజ్య సంస్థల్లో పని చేస్తున్న కార్మికుల పిల్లలు ఉపకారవేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కార్మిక శాఖ కమిషనర్ సి. జగదీశ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వాణిజ్య సంస్థలు, కర్మాగారాలు, సహకార సంస్థలు, ఇతర ట్రస్టులలో పని చేస్తున్న కార్మికుల పిల్లలు అర్హులన్నారు. అర్హులైన వారు ఫిబ్రవరి 15లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రెండు మాటల్లో

ప్రారంభమైన పూసాయి ఎల్లమ్మ జాతర

జైనథ్, జనవరి 3: మండలంలోని పిప్పర్వాడ గ్రామ పంచాయతీ పరిధిలోని పూసాయి గ్రామంలో గల దుర్గా మాత (ఎల్లమ్మ) జాతర బుధవారం ప్రారంభమైంది. ఈ జాతర పుష్యమాసం నుంచి మాఘమాసం వరకు నెల రోజుల పాటు కొనసాగుతోంది. ఎల్లమ్మగ గర్భగుడి నుంచి కొనేరు వచ్చే నీటిని రైతులు పండించే పంటలపై చల్లితే ఎలాంటి చీడ పీడలు ఉండవని భక్తుల నమ్మకం. ఈ జాతరకు సరిహద్దున గల మహారాష్ట్రతో పాటు తెలంగాణలోని ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలను ప్రజలు తరలి వచ్చి మేకలు, కోళ్లను బలియిచ్చి తమ మొక్కులను, నైవేద్యాలు భక్తులు సమర్పిస్తారు.

రూరల్ సీఐగా ప్రదీప్‌కుమార్

ఆదిలాబాద్‌క్రైం, జనవరి3: ఆదిలాబాద్ రూరల్ సీఐగా ఎ.ప్రదీప్‌కుమార్ బుధవారం పదవి బాధ్యతలు చేపట్టారు. మందమర్రి ఎస్సైగా పని చేసిన ప్రదీప్‌కుమార్ పదోన్నతిపై ఆదిలాబాద్ రూరల్ సీఐగా వచ్చారు. రూరల్ సీగా పని చేసిన కె.పురుషోత్తం రెబ్బెన సీఐగా బదిలీపై వెళ్లారు.

పిల్లలను అక్కున చేర్చుకున్న ఐసీడీఎస్ అధికారులు

బజార్‌హత్నూర్, జనవరి 3: డిసెంబర్ 31న ఆదివారం ఆంధ్రజ్యోతి మినీలో 'తల్లిదండ్రి మరణంతో అనాథలైన పిల్లలు' దళిత కుటుంబ దీనగాధ కథనానికి స్పందించిన కలెక్టర్ డి.దివ్య సమగ్ర పిల్లల సంరక్షణ సేవా సంస్థ జిల్లా అధికారి రాజేంద్ర ప్రసాద్, ఐసీడీఎస్ అధికారులను వెంటనే భూతాయితాండ గ్రామానికి వెళ్లాలని ఆదేశించడంతో బుధవారం అధికారులు భూతాయితాండ గ్రామానికి చేరుకొని వాఘ్మారే ప్రియాంక(14), వాఘ్మారే దళిత్‌కుమార్(12), వాఘ్మారే వైభవ్(10)లను ఆదిలాబాద్‌లోని బాల సదనంకు తీసుకెళ్లారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని భూతాయి తాండ గ్రామంలో వాఘ్మారే ప్రతిభ కిడ్నీ సంబంధిత వ్యాధితో అనారోగ్యం శుక్రవారం ఉదయం మరణించడంతో ఆమె ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు. ఆంధ్రజ్యోతి పిల్లల దీనగాధను ప్రచురించడంతో భూతాయి తాండకు చేరుకున్న అధికారులు గ్రామస్థులతో మాట్లాడి చైల్డ్‌హోం (బాలసదనం)లో తరిలించేందుకు ఒప్పుకున్నారు. బోథ్ సీఐ జయరాం, సర్పంచ్ వాఘ్మారే రాజు, చౌహన్‌శీతల్, సూపర్ వైజర్‌లువిజయ, ఐసీపీఎస్ సోషల్ వర్కర్ వీణ, రమేష్, పరమేశ్వర్, సింధు పాల్గొన్నారు.



అనాథ పిల్లలతో ఐసీడీఎస్ జిల్లా అధికారి రాజేంద్రప్రసాద్

ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు

▸▸ జిల్లా వ్యాప్తంగా నివాళులర్పించిన పలు సంఘాల నాయకులు



ప్రభుత్వ కళాశాలలో నివాళులర్పిస్తున్న అధికారులు



తలమడుగులో నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్, జనవరి 3: జిల్లా వ్యాప్తంగా చదువుల తల్లి మొట్టమొదటి ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం సావిత్రీబాయి పూలే 187వ జయంతి వేడుకల్లో భాగంగా స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయ ఆవరణలో ఉన్న పూలే దంపతుల విగ్రహాలకు జిల్లా జాయింట్ కలెక్టర్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అధికారులు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించి, నివాళులర్పించారు. గురుకుల బాలికల పాఠశాలలో స్వేరోజ్, మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కోలిపూర, అంబేద్కర్ భవన్‌లో, టీఎస్ ఎమ్మార్పీఎస్ నాయకులు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో, నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో, దళిత సంఘాల ఆధ్వర్యంలో నాయకులు సావిత్రీబాయి పూలేకు ఘనంగా నివాళులర్పించారు. అంతకు ముందు జిల్లా జాయింట్ కలెక్టర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ దేశంలో ప్రతీ మహిళకు సావిత్రీబాయి పూలేనే ఆదర్శమని తెలిపారు. ఇందులో అధికారులు ఆశన్న, భాగ్యలక్ష్మీ, రాజేశ్వర్, దళిత సంఘాల నాయకులు బి.కృష్ణ, పతిహార ప్రభాకర్ స్వేరోజ్ సభ్యులు హస్తక్ సుభాష్, పెంటపర్తి ఊశన్న, కుశాల్ జాడే, పొచ్చన్న, షరీఫ్, ప్రియాంక, జువ్వక నర్సింహులు, శ్రీకాంత్, టీఎమ్మార్పీఎస్ నాయకులు మనోజ్‌కుమార్, నక్కరాందాస్, ప్రసన్నకుమార్, నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు శ్రీనివాస్, మాలి సంఘం నాయకులు సుకుమార్‌పెట్కూలే, ఎస్ఎఫ్ఐ నాయకులు కిరణ్, సీపీఎం, సీఐటీయూ నాయకులు, టీవీఎస్ నాయకులు మయూరిఖాన్, మసిఉల్లా ఖాన్, సచిన్, మల్లేష్ పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలే అడుగుజాడల్లో నడుచుకోవాలి..

తలమడుగు, జనవరి 3: భారత దేశం తొలి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రీ బాయి పులే అడుగు జాడల్లో నడుచుకోవాలని కుచ్లాపూర్ ఎంపీటీసీ పర్దాన్ పుష్ప వామన్ కోరారు. బుధవారం సావిత్రీ భాయి పులే 187వ జయంతిని పురస్కరించుకొని ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ మహిళలందరికీ చదువు నేర్పించాలనే సంకల్పంతో సావిత్రిబాయి పులే ఎన్ని అడ్డంకులు ఎదురయినా మహిళలకు చదువు నేర్పించేందుకు ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాలి సంక్షేమ సంఘం నాయకులు రాములు, జనార్ధన్, కిషన్, రామారావ్, ఉత్తమ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నార్నూర్, జనవరి 3: మండలంలోని కొత్తపెల్లి ధమ్మ నగర్‌లో సావిత్రీ భాయి పులే జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా సావిత్రి భాయి చిత్ర పటానికి నివాళులర్పించారు. ఇందులో అంబేద్కర్ సంఘం నాయకులు జాడె తుకారం, శ్యాం సుందర్, సిద్ధార్థ్, ఈ కార్యక్రమంలో జ్యోతి రామ్, సోమాజి, ముత్యం, శ్యాం రావ్, వసంత్ రావ్, ప్రహ్లాద్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులను ఆదుకుంటాం

▸▸ కలెక్టర్ డి. దివ్య



గ్రామస్థుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్

బజార్‌హత్నూర్, జనవరి 3: మండలంలోని బజార్‌హత్నూర్ సాగు నీటి ప్రాజెక్టు ముంపు గ్రామం దేగామలోని భూ ని ర్వాసితులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని జిల్లా పాలనాధికారి డి. దివ్య తెలిపారు. బుధవారం మండలంలోని దేగామ గ్రామాన్ని సందర్శించి ప్రాజెక్టు ముంపులో దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. ముంపుకు గురైన ఇళ్లల్లోకి వెళ్లి మహిళలతో మాట్లాడారు. ప్రాజెక్టు నిర్మించి 12 సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు నష్ట పరిహారం రాలేదని, వరదలు వచ్చినప్పుడు వరద నీరు పాములు, తేల్లు ఇళ్లలోకి వస్తున్నాయని, వరద నీటితో ఇండ్లు శిథిలావస్థకు చేరుకొని కూలుతున్నాయని పేర్కొన్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు జిల్లా కలెక్టర్ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం గ్రామస్థులు ఏర్పాటు చేసిన భూ నిర్వాసితుల గురించి నీటి పారుదల శాఖ సెక్రటరీ వికాస్ రాజ్‌తో మాట్లాడానని గ్రామస్థుల సమస్యలను తెలుసుకోవడానికి ప్రత్యక్షంగా గ్రామాన్ని సందర్శించానని తెలిపారు. దేగామ గ్రామంలోని ముంపు ఇళ్లలో మొదటి విడత 77, రెండో విడత 74 ఇళ్లను రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. ప్రస్తుతం మూడవ విడతలో 130 ఇళ్లను ఎగువ ప్రాంతంలో ఇందిరా ఆవాస యోజన పథకంలో భాగంగా 6 నెలల్లో నిర్మించి ఇస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. దాంతో పాటు నష్ట పరిహారం ఇవ్వడానికి కూడా ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. ప్రస్తుతం 130 ఇళ్లతో పాటు గ్రామంలో మిగిలిన 197 ఇళ్లను కూడా ఎగువ ప్రాంతంలోకి తరలించి కొత్త ఇండ్లను నిర్మించి ఇవ్వాలని కలెక్టర్‌కు 197 బాధితులు విన్నవించుకున్నారు. స్పందించిన కలెక్టర్ త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వానికి, నీటి పారుదల శాఖకు నివేదిక పంపుతానని తెలిపారు. అనంతరం దేగామ ఎగువ ప్రాంతంలో సర్పంచ్‌గూడ సమీపంలో ఇళ్ల నిర్మాణం కొరకు ప్రభుత్వం సేకరించిన 14 ఎకరాల భూమిని ఆమె దివ్య పరిశీలించారు. 130 కుటుంబాలకు లక్కీ డ్రా ద్వారా ఇండ్ల స్థలాలను ఇచ్చి గృహాలను నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీవో సూర్యనారాయణ, నీటి పారుదల శాఖ ఈఈ సుశీల్ కుమార్, డీఈ భీం రావ్, జేఈ ప్రేం సింగ్; ఎంపీపీ సోమ రాంరెడ్డి, తహసీల్దార్ రాజేందర్ సింగ్, ఎంపీడీవో దుర్గం శంకర్, ఏవో ప్రమోద్ రెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ సదానందం, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకున్న ఘనత కేసీఆర్‌దే: బాలూరి

ఆదిలాబాద్‌టౌన్, జనవరి 3: గత ప్రభుత్వాలు రైతులను ఆదుకోవడంలో విఫలమైతే సాధించుకున్న మూడున్నర సంవత్సరాల తెలంగాణలో రైతులను ఆదుకున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని టీఆర్ఎస్ రైతు జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అనుకున్న మాట నిలబెట్టి రైతులకు 24గంటల కరెంట్‌ను అందిస్తున్నారన్నారు. బుధవారం స్థానిక డైరీ ఫాంలో ఆయన మాట్లాడారు. రైతులు తమ పంటలను నష్ట పోవడం, ఆత్మహత్యలు చేసుకోవడం వంటివి చూడలేక సీఎం కేసీఆర్ వారికి 24గంటల కరెంట్‌ను అందించేందుకు సన్నద్ధం చేసి జనవరి 1న అమలు చేయడం జరిగిందన్నారు. ఇందులో ఇజ్జగిరి నారాయణ, మంచికట్ల ఆశమ్మ, మండల ఉపాధ్యక్షుడు గంగాధర్, అశోక్ స్వామి, ఎం.అశోక్, మమత, అందె శ్రీదేవి, బండారి సతీష్ పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ

ప్రజలకు నాణ్యమైన సేవలు



భోజన్న, మావల తహసీల్దార్

ఆంధ్రజ్యోతి: నూతనంగా ఏర్పడిన మావల మండలంలో ప్రజలకు ఎలాంటి సేవలందిస్తున్నారు?

అధికారి: ప్రభుత్వం ప్రజలకు మెరుగైన, నాణ్యమైన సేవలందించేందుకు కృషి చేస్తోంది. ప్రజా సమస్యలపై దృష్టి సారించే అవకాశం ఉంటుంది. అందుకు వాటి పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: మండలంలో భూ ప్రక్షాళన ఎలా కొనసాగుతుంది. ఎంత వరకు పూర్తయింది?

అధికారి: మావల మండలంలో భూ ప్రక్షాళన పూర్తయింది. గడువు కంటే ముందుగానే అర్హులైన రైతులకు, ప్రజలకు రికార్డుల ప్రకారం రెవెన్యూ రికార్డుల్లో వారి పేర్లను నమోదు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మండలంలో అత్యధికంగా ఏఏ సమస్యలు తమ దృష్టికి వచ్చాయి?

అధికారి: కొత్త మండలాల ఏర్పాటుతో పరిధి తగ్గినందున పింఛన్, రేషన్, ఇళ్ల స్థలాల వంటి సమస్యలు తమ దృష్టికి వచ్చాయి. వీటిని పై అధికారుల సూచన మేరకు పరిష్కార మార్గాలు ఆలోచిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎంత మంది జనాభా ఉన్నారు. ఓటరు నమోదు ఏ విధంగా కొనసాగుతుంది?

అధికారి: మావల మండలంలో సుమారు లక్ష జనాభా ఉంటుంది. ఇదే మండలంలో ఎన్నికల సంఘం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తూ నూతన ఓటర్ల పేర్లను నమోదు చేసుకుంటున్నాం.

- ఆదిలాబాద్ టౌన్

ఉట్నూర్

ఇంద్రవెల్లి మండల అధికారుల ఫోన్ నెంబర్లు

తహసీల్దార్	..	94910 53528
ఎంపీడీవో	..	97044 11940
ఏపీవో,ఈజీఎస్	..	80966 04177
ఏఈ, పీఆర్	..	98662 03058
ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్	..	99483 60734
ఎఫ్ఆర్వో	..	73826 00324
మెడికల్ ఆఫీసర్ (పిట్టబొంగరం)		97051 24381
ఏఈ, ట్రాన్స్‌కో	..	94408 11702
ఏఈ ఎంఐ	..	83330 84230
ఎస్ఐ	..	94409 00660
అగ్రికల్చర్ ఆఫీసర్	..	72888 94053
ఎంఈవో	..	94934 33739
ఏఈఐటీడీఏ	..	73826 27394
ఈవో గ్రామపంచాయతీ	..	94402 62687

మొక్కలు పెంచుతున్నా.. అందని డబ్బులు

ఏవియేషన్ ప్లాంట్స్ పథకం కింద లక్ష మొక్కలను సిద్ధం చేస్తున్న అధికారులు ▸▸ నిధుల్లేక ఈజీఎస్ కూలీల నానా పాట్లు

ఉట్నూర్, జనవరి 3: ప్రభుత్వం హరితహారం కార్యక్రమం ద్వారా మొక్కల పెంపకంపై దృష్టి పెట్టినప్పటికీ.. మొక్కలు పెంచుతున్న కూలీలు మాత్రం సకాలంలో కూలీ డబ్బులు రాక ఇబ్బందులు పడుతున్నారు. ఉట్నూర్ ఆర్డీవో కార్యాలయం ఆవరణలో, అటవీ శాఖ నర్సరీలో హరిత హారం ద్వారా మొక్కలు పెంచుతున్నప్పటికీ కూలీలకు సకాలంలో వేతనాలు ఇవ్వడంలో జాప్యం జరుగుతోందని కూలీలు పేర్కొంటున్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న హరిత హారం నర్సరీలలో ఇరికి, చైనబాధం, ఎగిసి, అల్లనేరేడు, వేప, నేమలినారా, నిద్రగన్నేరు, ఇప్ప, సందుగా లాంటి లక్ష మొక్కలు హరిత హారం పథకం కోసం కూలీలు సిద్ధం చేస్తున్నారు. ప్రతి రోజూ కంటికి రెప్పలా కాపాడుకుంటూ ఏవియేషన్ ప్లాంట్స్ పథకం కింద లక్ష మొక్కలు సిద్ధం చేస్తున్న ఏప్రిల్ నుంచి డబ్బులు విడుదల కాక కూలీలు నిరుత్సాహానికి లోనవుతున్నారు. ఇప్పటికైన అధికారులు వెంటనే కూలి డబ్బులు చెల్లించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



మొక్కలకు నీరు పడుతున్న కూలి

ఏప్రిల్ నుంచి డబ్బులు రాలేదు..

ఏవియేషన్ ప్లాంట్ పథకం కింద అటవీ శాఖ అధికారుల ఆదేశాల మేరకు నర్సరీలలో మొక్కలు పెంచుతున్నా.. ఏప్రిల్ నుంచి కూలి డబ్బులు రావడం లేదు. కేవలం వారం డబ్బులు మాత్రమే వచ్చాయి. కూలీల వేతనాలను ఉన్నతాధికారులు వెంటనే మంజూరు చేసి ఆదుకోవాలి.

- ఉరే రమేష్, ఈజీఎస్ కూలి



కోవ సంగీత కుటుంబాన్ని ఆదుకోవాలి

▸▸ స్వరాజ్య వేదిక అధ్యక్షుడు బొర్రన్న

ఇంద్రవెల్లి, జనవరి 3: ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందిన కోవ సంగీత కుటుంబాన్ని విద్యుత్ శాఖ ఆదుకోవాలని రైతు స్వరాజ్య వేదిక అధ్యక్షుడు సంగెపు బొర్రన్న డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మండలంలోని గౌరాపూర్ పంచాయతీ చిత్తబట్ట గ్రామానికి చెందిన కోవ సంగీత కుటుంబాన్ని పరామర్శించారు. సంఘటనకు జరిగిన కారణాలను, వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంటి అవసరాల కోసం ఇంటి పక్కనే ఉన్న బోర్ మోటార్‌ను ఆన్ చేసే సరికి షాక్ తగిలి మృతిచెందిందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.4 లక్షలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ యేడాది ఉమ్మడి జిల్లాలో మొత్తం 63 మంది విద్యుదాఘాతంతో మృతి చెందారని, అందులో 42 మందికి రూ.4 లక్షలు ఇవ్వడం జరిగిందన్నారు. ఆయనతో పాటు మడావి దేవ్ రావ్, లాల్ షా, బండు తదితరులున్నారు.

7న ఆదిలాబాద్‌లో ఉచిత వైద్య శిబిరం

ఆదిలాబాద్‌టౌన్, జనవరి3: ఆర్యవైశ్య విశ్రాంత ఉద్యోగుల అభివృద్ధి, సంక్షేమ సంఘం ఆదిలాబాద్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 7న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నామని సంఘం అధ్యక్షుడు పడిగెల మధుకర్ తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాసవీ కన్యాకపరమేశ్వరి మందిరంలో ప్రముఖ వైద్య నిపుణుల చేత ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో ఎముకుల వైద్య నిపుణులు అనిల్‌చిద్రాల, మధుమేహం నిపుణులు రవికుమార్ బచ్చువారు, పిల్లల వైద్యనిపుణులు హేమచిద్రాల, రాకేష్‌బచ్చువార్, అంకుష్‌కొమ్మ వార్, జనరల్ ఫిజిషియన్ రాకేష్‌బండారివార్, స్త్రీ వైద్య నిపుణులు శృతిజువ్వాజిలు చికిత్సలు నిర్వహిస్తారన్నారు. ఈ సమావేశంలో సంఘం సభ్యులు సురేష్‌కొమ్మావార్ 9849025334, ప్రమోద్‌కొమ్మావార్ 9247299997 నెంబర్‌లలో సంప్రదించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

ప్రారంభమైన..
పెన్‌గంగా జాతర

దక్షిణ భారతదేశంలో అతి పెద్ద జాతరగా పేరుగాంచిన మహారాష్ట్ర-తెలంగాణ సరిహద్దున గల పెన్‌గంగా జాతర బుధవారం పౌర్ణమి రోజున ఘనంగా ప్రారంభమైంది. భక్తుల పుణ్య స్నానాలు, నైవేద్యాలు.. సందడితో జాతర హోరెత్తింది.

ఫొటో న్యూస్



జాతరలో భక్తుల సందడి ఇలా..



రథోత్సవానికి పూజలు చేస్తున్న మహిళలు



మూడు ముక్కల్లో..

7న ఆదిలాబాద్‌లో ఆదివాసీ ఆత్మీయ చర్చాగోష్టి

ఉట్నూర్, జనవరి 3 : ఈ నెల 7న ఆదిలాబాద్‌లోని ఎన్టీఆర్ చౌరస్తాలోని ఉర్దూ భవన్‌లో ఉదయం 10గంటలకు ఆదివాసీ ఆత్మీయ చర్చాగోష్టి నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ ఆత్మీయగోష్టి ఆహ్వాన కమిటీ కో కన్వీనర్ రాయిసిడాం బాపురావు తెలిపారు. సీసా చట్టం, అటవీ హక్కుల చట్టం నామ మాత్రం అయిందని, స్వార్ధ రాజకీయ ప్రయోజనాల కోసం లంబాడాలను ఎస్టీ జాబితాలో చేర్చారని, కేవలం విద్య, ఉద్యోగ అవకాశాలకు సంబంధించిన విషయం కాదని అన్నారు. ప్రభుత్వం ఆదివాసీ గూడాలలో పోలీసులను పెట్టి ఆదివాసీ ఉద్యమాన్ని అణిచి వేయడానికి చూస్తున్నందున ఆదివాసీ ఆత్మీయ గోష్టికి ఆదివాసీ పటేల్‌లు, ఆదివాసీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, సార్‌మేడిలు, విద్యార్థి సంఘాలు, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు, మాజీ ఆదివాసీ ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి

▸▸ ఎమ్మార్పీఎస్ డిమాండ్

ఉట్నూర్, జనవరి3: పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని ఉట్నూర్ మండల ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక తహసీల్దార్ మడావి విశ్వనాథ్‌ను కలిసి మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు బిరుదుల లాజర్ మాదిగ మాట్లాడుతూ.. దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం ఆందోళనలు చేసున్నా.. ప్రభుత్వాలు కనుకరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తెలంగాణ ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లు పెట్టేలా ఢిల్లీకి ప్రతినిధి బృందాన్ని తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. ఇందులో సంజీవ్ మాదిగ, మహాదూర్, సుభాష్, భరత్‌మాదిగలు పాల్గొన్నారు.

తుడుందెబ్బ మండల అధ్యక్షుడిగా నాగ్‌నాథ్



ఇంద్రవెల్లి, జనవరి 3: తుడుందెబ్బ మండల అధ్యక్షుడిగా కేస్లాపూర్‌కు చెందిన మేస్రం నాగ్‌నాథ్‌ను ఎంపిక చేశారు. ఈ మేరకు తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి ఉయిక సంజీవ్ ప్రకటించారు. తనపై ఎంతో నమ్మకంతో పదవీ కట్టబెట్టినందుకు న్యాయం చేస్తానని ఆదివాసీల హక్కులు కాపాడుతానని ఈసందర్భంగా ఆయన పేర్కొన్నారు.

నేటి నుంచి తాడిహత్నూర్‌లో క్రికెట్ టోర్నమెంట్

నార్నూర్, జనవరి 3: మండలంలోని తాడిహత్నూర్‌లో జ్యాగ్‌వార్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పవార్ కృష్ణ, రాథోడ్ శ్రీనివాస్, లవకుశలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్ ఆటపై ఎక్కువ మక్కువ చూపుతున్నందు వల్ల ఉట్నూర్ డివిజన్‌లోని క్రీడాకారులందరూ నేరుగా తమను సంప్రదించాలని వారు కోరారు.

నిరుద్యోగ భృతి చెల్లించాలి

నార్నూర్, జనవరి 3: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావడంతో నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి చెల్లించాలని గాదిగూడ మండల దళిత, గిరిజన సంఘాల నాయకులు గాగ్రు, పురుషోత్తం, విద్యాన్‌లు కోరారు. గాదిగూడ మండల కేంద్రంలో బుధవారం తమను కలిసిన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ప్రాంతం అభివృద్ధి దిశగా పయనిస్తున్నప్పటికీ చాలా మంది నిరుద్యోగులు జీవన భృతి లేక నిరుద్యోగంతో ఆరాటపడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వాధికారులు నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇంటర్వ్యూ

స్వచ్ఛభారత్‌పై ప్రజలకు అవగాహన



లక్ష్మణ్, ఎంపీడీవో, ఉట్నూర్

ఆంధ్రజ్యోతి : మరుగుదొడ్ల పనులు ఎలా సాగుతున్నాయి ?

ఎంపీడీవో : ఓడీఎప్ పథకం కింద ప్రభుత్వం తొలి దశలో చాందూరి, శ్యాంపూర్, లక్షటిపేట, ఘన్‌పూర్, దంతన్‌పల్లి ఐదు గ్రామ పంచాయతీలను ఎంపిక చేయడంతో మరుగుదొడ్ల పనులు చేపట్టాం.

ఆంధ్రజ్యోతి : ఇంకా ఓడీఎఫ్ పనులు కొనసాగుతున్నాయా ?

ఎంపీడీవో : ప్రస్తుతం ప్రభుత్వం ఓడీఎఫ్‌కు బదులు మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో కూడా స్వచ్ఛ భారత్ పథకం ద్వారా ఇంటింటికీ మరుగుదొడ్లు నిర్మించుకోవడానికి 12 వేలు మంజూరు చేస్తోంది.

ఆంధ్రజ్యోతి : ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా ?

ఎంపీడీవో : గ్రామ పంచాయతీల కార్యదర్శుల ద్వారా, సర్పంచ్‌ల ద్వారా ప్రజలకు మరుగుదొడ్లు నిర్మించుకోవాలని, బహిరంగ మలవిసర్జన చేయడం ద్వారా అంటువ్యాధులు వస్తాయని ప్రచారం నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాం. తద్వారా గ్రామీణులు ఎస్‌బీఎం పథకం ద్వారా మరుగుదొడ్లు నిర్మించుకోవడానికి ముందుకు వస్తున్నారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 3, 7, 4



మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): చిన్నారుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. చిట్‌ఫండ్‌లు, డిపాజిట్లపై ప్రతిఫలం అందుకుంటారు. ప్రముఖులతో వేడుకల్లో పాల్గొంటారు. మీ ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది. ఆర్థిక విషయాల్లో సంకల్పం నెరవేరుతుంది.



వృషభరాశి: (ఏప్రిల్21-మే20): మార్పు కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. బదిలీల విషయంలో వ్యూహాత్మకంగా వ్యవహరించి లక్ష్యం సాధిస్తారు. బంధుమిత్రుల కలయికతో ఇంట్లో సందడిగా ఉంటుంది. ఇంటికి అవసరమైన వస్తువుల రవాణాకు అనుకూలం.



మిథునరాశి: (మే21-జూన్21): చెక్కులు, విలువైన డాక్యుమెంట్లు అందుకుంటారు. స్టేషనరీ, రవాణా, బోధన, ఏజెన్సీ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. సోదరీ సోదరుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది.



కర్కాటకరాశి: (జూన్22-జూలై23): ప్రియతముల కోసం విలువైన వస్తువుల కొనుగోలు చేస్తారు. వేడుకల్లో పాల్గొంటారు. భాగస్వామ్యాలు లాభిస్తాయి. స్నేహ పరిచయాల ఆధారంగా ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు.



సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. కొత్త ప్రాజెక్టుల ప్రారంభానికి అనుకూల సమయం. విందు, వినోదాలతో ఉల్లాసంగా గడుపుతారు. ఉద్యోగ సంస్థలు, పరిశ్రమలు, వైద్య రంగాల వారికి కొత్త ఆలోచనలు స్ఫురిస్తాయి.



కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): దూరంలో ఉన్న ప్రియతములు ఇల్లు చేరతారు. ప్రయాణాలు, చర్చలు, వేడుకలు ఉల్లాసం కలిగిస్తాయి. సినీ, రాజకీయ, న్యాయ రంగాల వారికి ఆర్థికంగా అనుకూలిస్తుంది. ప్రియతములకు సంబంధించి కీలక సమాచారం అందుకుంటారు.



తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): వేడుకలకు ఏర్పాట్లు చేస్తారు. ఇంటి కోసం విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. బంధు, మిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. ప్రదర్శనలు, సభలకు అనుకూలం. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల వైఖరి గురించి ఆలోచిస్తారు.



వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ఉద్యోగ, వ్యాపారాలకు సంబంధించిన శుభవార్త అందుకుంటారు. సోదరీ సోదరుల విషయాల్లో శుభ పరిణామాలు సంభవం. పెద్దలతో సమావేశాలు ఉల్లాసం కలిగిస్తాయి. వృత్తి, ఉద్యోగాలకు సంబంధించిన కీలక సమాచారం లభిస్తుంది.



ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ప్రయణాలకు అవసరమైన నిధులు సమకూర్చుకుంటారు. సంకల్పం ఫలిస్తుంది. వేడుకల్లో పాల్గొంటారు. ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. పెట్టుబడులకు సంబంధించిన వివరాలు సేకరిస్తారు.



మకరరాశి(డిసెంబర్22-జనవరి21): బీమా వ్యవహారాలకు అనుకూలం. ఆర్థిక వ్యవహారాలపై స్పష్టమైన నిర్ణయానికి వస్తారు. ఆత్మావలోకనం చేసుకునేందుకు తగిన సమయం. పూర్వమిత్రులను కలుసుకుంటారు. మ్యూచ్యువల్ ఫండ్స్, బ్యాంకు లావాదేవీలు లాభిస్తాయి.



కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): సినీ, రాజకీయ రంగాల వారికి కొత్త పరిచయాలు లాభిస్తాయి. భాగస్వామి గురించి ఆలోచిస్తారు. లక్ష్య సాధనకు పరిచయాలు తోడ్పడతాయి. సమావేశాలు, బృందకార్యక్రమాల్లో పాల్గొంటారు. దూర ప్రాంతాల్లో ఉన్న వ్యక్తులతో అనుబంధం ఏర్పడుతుంది.



మీనరాశి: (ఫిబ్రవరి19మార్చి20): ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. వైద్యం, హోటల్, రిటైల్ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. ఆహార నియమాలు పాటిస్తారు. బంధుమిత్రులతో విందు వినోదాల్లో పాల్గొంటారు. ఆస్పత్రులు సందర్శిస్తారు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

▸▸ మంచిర్యాల జిల్లా విద్యాశాఖ అధికారి రవికాంత్‌రావు

మంచిర్యాల రూరల్, జనవరి3: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి జాతీయ స్థాయిలో పథకాలు తేవాలని మంచిర్యాల జిల్లా విద్యాశాఖ అధికారి రవికాంత్‌రావు సూచించారు. బుధవారం హాజీపూర్ మండలంలోని శ్రీవిద్యారణ్య ఆవాస విద్యాలయంలో శిశుమందిరాల విభాగ్ స్థాయి ఖేల్‌కూద్ పోటీల సందర్భంగా ఆయన మాట్లాడారు. శ్రీ సరస్వతి శిశు మందిర పాఠశాలల్లో చదువు, ఆటలు, నైతిక విలువలు నేర్పుతారన్నారు. విద్యార్థులు ఖేల్‌కూద్ పోటీల్లో పాల్గొనడం అదృష్టంగా భావించాలన్నారు. గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ఓడిన వారు మళ్లీ ప్రయత్నించి గెలుపొందాలన్నారు. అనంతరం జిల్లా వెహికల్ ఇన్‌స్పెక్టర్ గుర్రం వివేకానందరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆవాస పాఠశాల అధ్యక్షుడు వినయ్ ప్రకాష్ రాజు, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రావు, రామగుండం వెహికిల్ ఇన్‌స్పెక్టర్ పుస్కూరి రంగారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామన్న పాల్గొన్నారు.

శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయం చొక్కారాంనగర్‌లో విభాగ్ స్థాయి ఖేల్‌కూద్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఈ పోటీల్లో మంచిర్యాల, కుమరంభీం ఆసిఫాబాద్, పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న, సిరిసిల్లలకు చెందిన శిశు మందిరాలకు సంబంధించిన 500 మంది విద్యార్థులు ఈ ఖేల్‌కూద్ పోటీల్లో పాల్గొన్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. పరుగుపందెం, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, జావెల్లింగ్‌త్రో, కోకో, కబడ్డీ తదితర పోటీలను నిర్వహించారు. వంద మీటర్ల పరుగుపందెంలో టీ పూర్ణచందర్, 200 మీటర్ల పరుగుపందెంలో ఎం.వేణు, షాట్‌పుట్‌లో జ్ఞానేశ్వర్, డిస్క్‌త్రోలో జ్ఞానేశ్వర్, లాంగ్‌జంప్‌లో ఎస్ శ్రీకాంత్, హైజంప్‌లో పూర్ణచందర్, ఖోఖోలో రాంపూర్ ఆవాస విద్యాలయం ప్రథమ బహుమతులను గెలుచుకున్నారు.



మాట్లాడుతున్న డీఈవో రవికాంత్‌రావు



ఖోఖో ఆడుతున్న విద్యార్థినులు

రాష్ట్ర స్థాయి అండర్-14 క్రికెట్ జట్టుకు స్రృంజిత్‌రెడ్డి ఎంపిక

▸▸ రాష్ట్ర అండర్ - 14 క్రికెట్ జట్టుకు డీసీసీ అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి తనయుడు

▸▸ కేరళ రాష్ట్రంలో ఈ నెల 7 నుంచి జరిగే పోటీలకు స్రృంజిత్‌రెడ్డి ప్రాతినిధ్యం

ఆంధ్రజ్యోతి, నిర్మల్, జనవరి3: జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఏలేటీ మహేశ్వర్‌రెడ్డి తనయుడు స్రృంజిత్ రెడ్డి రాష్ట్రస్థాయి అండర్-14 క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడు. 11 యేళ్ల వయసున్న స్రృంజిత్‌రెడ్డి ఈనెల 7 నుంచి 21 వరకు కేరళ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు తెలంగాణ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఇప్పటికే పలు మ్యాచ్‌ల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన స్రృంజిత్‌రెడ్డి ఆల్‌రౌండర్‌గా రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. గత 9 మ్యాచ్‌ల్లో అతడు నాలుగు సార్లు ఐదు వికెట్లు, మూడుసార్లు నాలుగు వికెట్లను మొత్తం 33 వికెట్లు సాధించి అత్యుత్తమ ఆల్‌రౌండర్‌గా ప్రతిభను చాటుకున్నాడు. ఈ ప్రతిభ ఆధారంగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ స్రృంజిత్‌రెడ్డిని అండర్-14 రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసింది. ఈ నెల 5న ఆయన కేరళకు జట్టు సభ్యులతో కలిసి వెళ్లనున్నారు. కాగా స్రృంజిత్‌రెడ్డి రాష్ట్ర జట్టులో స్థానం సాధించడం పట్ల పలువురు జిల్లా క్రికెట్ అభిమానులు అభినందనలు తెలిపారు.



డీసీసీ అధ్యక్షుడి తనయుడు స్రృంజిత్ రెడ్డి

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని వినతి

మంచిర్యాల అర్బన్, జనవరి3: ఎస్సీ వర్గీకరణ, డప్పు, చెప్పు వృత్తుల వారికి రూ.2 వేల పెన్షన్ ఇవ్వాలని మంచిర్యాల జిల్లా సంయుక్త పాలనాధికారి వై.సురేందర్‌రావుకు బుధవారం ఎంఆర్‌పీఎస్ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఎస్సీ వర్గీకరణపై ఎంఆర్‌పీఎస్ పోరాటం చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం చొరవ తీసుకొని చట్టబద్ధత కల్పించాలని కోరారు. సంయుక్త పాలనాధికారికి వినతిపత్రాన్ని అందజేసిన వారిలో కాశి సతీష్‌కుమార్ మాదిగ, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు , తదితరులు ఉన్నారు.

గూడెం సత్యదేవుని ఆలయ హుండీ లెక్కింపు

▸▸ రూ. 2లక్షల 45వేల 875 ఆదాయం

దండేపల్లి జనవరి3: దండేపల్లి మండలం గూడెం గుట్ట శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయానికి పుష్యపౌర్ణమి సందర్భంగా రూ.2లక్షల 45వేల 875 ఆదాయం వచ్చినట్లు ఆలయ నిర్వహణాధికారి టి.నారాయణ, ఆలయ చైర్మన్ గోవర్ధన వెంకటస్వామిలు వెల్లడించారు. గూడెం శ్రీ సత్యనారాయణ స్వామి ప్రధాన ఆలయంలో బుధవారం దేవదాయ, ధర్మదాయశాఖ నిర్మల్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ రంగు రవికిషన్‌గౌడ్, ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు చైర్మన్ గోవర్ధన వెంకటస్వామి ఆధ్వర్యంలో పుష్య పౌర్ణమి హుండీని లెక్కించారు. భక్తులు స్వామివారికి కానుకగా వేసిన ఆదాయం రూ.1,32,016 రాగా రశీదులు, వ్రతాలు, ఇతరుల ద్వారా రూ.1,13,859 ఆదాయం వచ్చింది. గత ఏడాది పౌర్ణమి జాతరకు దేవాలయానికి రూ.లక్షా 61 వేల 312 ఆదాయం సమకూరింది. గత ఏడాది కంటే ఈసారి రూ.84,563 ఆదాయం ఎక్కువగా వచ్చింది. ఈ హుండీ లెక్కింపులో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు కొండు సత్తయ్య, ఆకుల తిరుపతి, కనగంటి తిరుపతి, సాయిని సుధాకర్, మారశెట్టి సత్తవ్వ, ఆలయ సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు రమణారావు, సత్యనారాయణ, అంజన్న, శ్రీసత్యనారాయణస్వామి సేవాసమితి నిర్వాహకులు, సభ్యులు పాల్గొన్నారు.

పులుల గణనపై అవగాహన



అటవీ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఎఫ్‌డీఓ రాజారాం

కోటపల్లి, జనవరి3: ఈ నెల 22 నుంచి 28 వరకు అటవీ ప్రాంతంలో నిర్వహించే పులుల గణనపై అటవీ శాఖ సిబ్బందికి బుధవారం కోటపల్లి రేంజ్ కార్యాలయంలో చెన్నూర్ డివిజనల్ అటవీ అభివృద్ధి అధికారి రాజారాం అవగాహన కల్పించారు. ప్రతి బీట్ అధికారికి ఇద్దరు వలంటీర్లను నియమించి బృందాలుగా ఏర్పాటు చేశారు. ప్రతి నిత్యం ఉదయం 6గంటల నుంచి ఐదు కిలో మీటర్ల మేర లైన్ వెంట తనిఖీలు చేపట్టడం, మాంసహార జంతువుల మల, మూత్ర విసర్జనలు, వెంట్రుకలు, అడుగులు తదితర అంశాలను గుర్తుపట్టే విధానంపై సిబ్బందికి వివరించారు. అలాగే అటవీ ప్రాంత ఎంత ఉంది, మైదాన ప్రాంతం ఎంత ఉందో, వృక్ష, గడ్డి జాతుల వివరాలు, పులుల జాడలు, పులి పిల్లలు ఉంటే వాటి వివరాలను సేకరించాలని ఎఫ్‌డీఓ రాజారాం సూచించారు. ఈ సమావేశంలో కోటపల్లి, నీల్వాయిల అటవీ శాఖ రేంజర్ రవి, అరవింద్, డిప్యూటీ రేంజర్ రేష్మ, బీట్ అధికారులు నాగరాజు చారి, స్వప్నలతోపాటు రేంజ్ సిబ్బంది పాల్గొన్నారు.

‘కీటక జనిత వ్యాధులను నియంత్రించాలి’

మంచిర్యాల అర్బన్, జనవరి3: కీటక జనిత వ్యాధులను నియంత్రించాలని మంచిర్యాల జిల్లా మలేరియా అధికారి విజయ పూర్ణిమ సూచించారు. జిల్లా ఉప వైద్యాధికారి కార్యాలయంలో బుధవారం సూపర్‌వైజర్లు, ల్యాబ్‌టెక్నిషియన్లు, హెల్త్ అసిస్టెంట్లతో కీటక జనిత వ్యాధులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల నివారణ చర్యలు చేపట్టి ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. క్షేత్ర స్థాయి నుంచి పంపిన రక్త పూతలను సకాలంలో పరీక్షించి ఫలితాలను వెల్లడించాలని ల్యాబ్ టెక్నీషియన్‌లకు సూచించారు. ఉప వైద్యాధికారి జ్యోతి మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ నిర్ధారించబడితే ఆ ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య ఆరోగ్య శిబిరాలను నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో సామాజిక ఆరోగ్య అధికారి వెంకటేశ్వర్లు అల్లాడి శ్రీనివాస్, తొగరి ప్రభాకర్, నాందేవ్, పుట్ట సత్తయ్య, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అవీ ఇవీ..

పుణె ఘటనను నిరసిస్తూ..
తానూర్ బంద్



నిరసన ప్రదర్శనలు చేస్తున్న బౌద్ధ మహాసభ ప్రతినిధులు

భైంసా, జనవరి 3: మహారాష్ట్రలోని పుణెలో సోమవారం చారిత్రాత్మక భీమ్-కోరెగావ్ యుద్ధ ద్విశతాబ్ది ఉత్సవాల సందర్భంగా దళితులపై చోటు చేసుకున్న దాడుల ఘటనలను నిరసిస్తూ నిర్మల్ జిల్లాలోని తానూర్ మండల కేంద్రంలో భారతీయ బౌద్ధ మహాసభ ఆధ్వర్యంలో బంద్ చేపట్టారు. ఉదయం వేళలో ఆయా ప్రాంతాలకు చెందిన భారతీయ బౌద్ధ మహాసభ సభ్యులు తానూర్ మండల కేంద్రానికి చేరుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. దాడులను వ్యతిరేకిస్తూ నిరసన ప్రదర్శనలు చేపట్టారు. అక్కడి నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అధికారికి వినతిపత్రం అందచేశారు. అనంతరం మండల కేంద్రంలోని వ్యాపార, వాణిజ్య సంస్థలను మూసి వేయించారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో తరగతులను బహిష్కరింప చేశారు. ఈ సందర్భంగా భారతీయ బౌద్ధ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్ పవార్, ప్రతినిధులు అంబాదాస్ పవార్, సాయినాథ్ బద్రే, భుజంగ్‌రావ్, రమేష్ తదితరులు మాట్లాడుతూ పుణెలో దళితులపై దాడులకు పాల్పడ్డ వారందరిని కఠినంగా శిక్షించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరో మారు ఎక్కడా కూడా దళితులపై దాడులు జరగకుండా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



అధికారికి వినతిపత్రం అందచేస్తున్న భారతీయ బౌద్ధ సభ ప్రతినిధులు

అర్హులైన దళితులకు
భూమి అందించాలి

▸▸ శిక్షణ కలెక్టర్

జైనథ్, జనవరి 3: జిల్లాలో భూమి లేని అర్హులైన దళితులకు భూమి అందించాలని శిక్షణ కలెక్టర్ అన్నారు. బుధవారం మండలంలోని మాకోడ గ్రామంలో దళితులకు అందించనున్న 47 ఎకరాల భూమిని ఆమె పరిశీలించారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జైనథ్ మండల తహసీల్దార్ బొల్లం ప్రభాకర్, సర్పంచ్ స్వామి రెడ్డిలతో పాటు రెవెన్యూ అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

హైటెక్ ఎలక్షన్!

▸▸ గ్రామ పంచాయతీ ఎన్నికలకు ప్రత్యేక పోర్టల్ ▸▸ ఆన్‌లైన్‌లోనే సభ్యుల నామినేషన్ నమోదుకు అవకాశం ▸▸ పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీ ఏర్పాటు



మావల గ్రామ పంచాయతీ కార్యాలయం

ఆదిలాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): 2018లో జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికలను గడువులోగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ముందస్తు కసరత్తు మొదలు పెట్టింది. ఇప్పటికే గత అక్టోబర్ 24, 25 తేదీలలో ఆదిలాబాద్ జిల్లాలో రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ వి. నాగిరెడ్డి పర్యటించి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పంచాయతీలు, వార్డులు, అవసరమైన బ్యాలెట్ బాక్సులు, బడ్జెట్, సమస్యాత్మకమైన పంచాయతీలు, సిబ్బందిపై ఉమ్మడి జిల్లా అధికారులతో ఎన్నికల సంఘం కమిషనర్ సమీక్షించారు. మొత్తానికి గడువులోగా ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ఉత్సాహంగా కనిపిస్తోంది. ఎన్నికల సంఘం సిఫార్సు మేరకు ప్రభుత్వం 2018 ఏప్రిల్ లేదా మే నెలల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తుంది. అయితే మునుపెన్నడు లేని విధంగా ఈ సారి పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగానే ప్రత్యేకంగా TSE.WEB-PO RTALను రూపొందించింది. ఓటరు జాబితాను మొదలుకొని సభ్యుల గెలుపోటముల వరకు సమాచారాన్ని ఈ ప్రత్యేక పోర్టల్‌లో ఉంచనున్నారు. దీని ద్వారా గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన వివరాలను ప్రజలు ఎక్కడి నుంచైనా తెలుసుకునే అవకాశం ఉంటుంది. రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలు హైటెక్ తరహాలో నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఇప్పటికే జిల్లా పంచాయతీ అధికారులకు దీనిపై శిక్షణను పూర్తి చేసింది. త్వరలోనే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎంపీడీవోలకు ప్రత్యేక వెబ్ పోర్టల్‌పై శిక్షణను నిర్వహించనున్నారు.

ఆన్‌లైన్‌లోనే నామినేషన్..

మరో నాలుగైదు మాసాల్లో నిర్వహించే పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే సభ్యులు తమ నామినేషన్లను ఆన్‌లైన్‌లోనే నమోదు చేసుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించనుంది. నామినేషన్ పత్రాలు కూడా ఆన్‌లైన్‌లోనే అందుబాటులో ఉంచనున్నారు. సభ్యులు ఎక్కడి నుంచైనా ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసుకొని నేరుగా పంచాయతీ ఎన్నికల అధికారికి సమర్పించాల్సి ఉంటుంది. ఈ విధానంతో నిరక్షరాస్యులైన సభ్యులకు ఇబ్బందులు తొలగిపోనున్నాయి. అలాగే గుర్తుల కేటాయింపులో కూడా అధికారులకు ఇక్కట్లు దూరమవుతాయి. గతంలో నామినేషన్ పత్రాలు అసంపూర్తిగా ఉండడంతో కొన్ని సందర్భాల్లో అధికారులు తిరస్కరించిన దాఖలాలు కూడా ఉన్నాయి. ఎన్నికల సంఘం సూచించిన విధంగా నామినేషన్‌ను నమోదు చేసిన అనంతరం సంబంధిత పత్రాలను డౌన్‌లోడ్ చేసుకొని ఇద్దరు సాక్ష్యులతో పాటు పోటీ చేసే సభ్యుడు సంతకం చేసి నామినేషన్ సమర్పిస్తే సరిపోతుంది. చేతి రాతతో నామినేషన్‌ను పూర్తి చేయాల్సిన అవసరం లేక పోవడంతో పొరపాట్లు జరిగే అస్కారం ఉండదు.

ప్రక్రియంతా ఆన్‌లైన్‌లోనే..

ఇక పంచాయతీ ఎన్నికల ప్రక్రియ అంతా ఆన్‌లైన్ ద్వారానే చేపట్టనున్నారు. ఎన్నికల్లో విధులు నిర్వహించే ఉద్యోగుల వివరాలు, వారి విధుల కేటాయింపు, వార్డుల విభజన, ఓటర్ల జాబితా, ఏ వ్యక్తి ఏపోలింగ్ స్టేషన్ పరిధిలో ఉన్నది తెలిసిపోనుంది. ఏ గ్రామంలో ఎన్ని పోలింగ్‌స్టేషన్లు ఉన్నాయో, వార్డులు, సర్పంచ్‌ల రిజర్వేషన్ వివరాలను ముందుగానే తెలుసుకోవచ్చు. ఎన్నికల చట్టాలు, నియమ నిబంధనలు ప్రత్యేక వెబ్ పోర్టల్‌లో ఉంచనున్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చిన ఏ ఫిర్యాదు చేయాలన్న పోర్టల్‌లో నమోదు చేస్తే నేరుగా ఎన్నికల సంఘం పరిశీలించి చర్యలకు ఆదేశించనుంది. ఎలక్షన్‌కు ముందు ఓటర్ల ఫోటోలతో కూడిన పోలింగ్ చిట్టీలను ప్రభుత్వ సిబ్బందే అందజేస్తారు. అలాగే ఏ పంచాయతీలో ఎన్ని నామినేషన్లు వేశారో ఎప్పటి కప్పుడు తెలిసిపోతుంది. మొత్తానికి ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు కసరత్తు జరుగుతోంది.

ఉమ్మడి జిల్లా
పంచాయతీల వివరాలు..

పంచాయతీల సంఖ్య	- 866
2018లో ఎన్నికలు జరిగే పంచాయతీల సంఖ్య	- 865
గ్రామీణ జనాభా	- 22లక్షల 35వేల 71
ఎస్టీ జనాభా	- 4 లక్షల 83వేల 255
ఎస్సీ జనాభా	- 4 లక్షల 16వేల 696
ఇతరులు -	13 లక్షల 35వేల 120
వార్డుల సంఖ్య	- 8732
బ్యాలెట్ బాక్సులు	- 1693
పోలింగ్ స్టేషన్	- 8839

అధికారులకు ప్రత్యేక శిక్షణ..



గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ ప్రత్యేక వెబ్ పోర్టల్‌ను రూపొందించింది. దీనిపై జిల్లా ఎంపీడీవోలకు, ఇతర సిబ్బందికి ప్రత్యేక శిక్షణను ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

- జితేందర్‌రెడ్డి,
జిల్లా పంచాయతీ అధికారి, ఆదిలాబాద్

అక్రమ దందాలకు అడ్డా!

▸▸ అడుగడుగునా రాజకీయ అండ ▸▸ మాఫియాను మరిపిస్తున్న ఇసుక దందా ▸▸ నిద్రావస్థలో సంబంధిత శాఖలు

నిర్మల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : అడుగడుగునా రాజకీయ అండదండలతో అక్రమ దందాలకు నిర్మల్ అడ్డాగా మారుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తెర వెనక నేతల ప్రమేయం ఉండడంతోనే ఈ అక్రమాల వ్యవహారాలు అడ్డు అదుపు లేకుండా పోతున్నాయంటున్నారు. కళ్ల ముందే నిర్భయంగా ఈ తంతు సాగుతున్నప్పటికీ దీనికి అడ్డుకట్ట వేయాల్సిన సదరు యంత్రాంగం నిద్రమత్తులో జోగుతుండడం అనుమానాలకు తావిస్తోంది. ఈ అక్రమ దందాల కారణంగా సర్కారుకు కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతుండగా, ఓ వైపు ప్రజల ఆరోగ్యానికి మరో వైపు పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుందంటున్నారు. ముఖ్యంగా నిర్మల్ జిల్లాలో గత కొంతకాలం నుంచి అక్రమ ఇసుక దందా మాఫియా కార్యకలాపాలను మరిపిస్తుందంటున్నారు. గోదావరి నదినే కాకుండా ఆనదికి సంబంధించిన కాలువలు, వాగులు, చెరువులను ఈ ఇసుకాసురులు యంత్రాలతో పిండేస్తున్నారు. ప్రతిరోజు వందల ట్రాక్టర్‌లతో ఇసుకను తరలిస్తూ కాసుల పంట పండించుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. ఇసుక తవ్వకాలతో భూగర్భ జలాలకు ముప్పు వాటిల్లుతున్నట్లు ఫిర్యాదులున్నప్పటికీ పట్టించుకునే వారు కరువయ్యారంటున్నారు. అలాగే నిర్మల్, భైంసా, ఖానాపూర్ పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో విచ్చల విడిగా బెల్ట్ షాపులు నిర్భయంగా కొనసాగుతున్నాయి. పలు గ్రామాల్లో ఈ మద్యం బెల్ట్ షాపులు బార్లను తలదన్నె రీతిలో నడుస్తున్నాయంటున్నారు. ఇసుక, బెల్ట్ షాపుల నిర్వహణ రాజకీయ అండతో సాగుతున్నది బహిరంగ రహస్యమంటున్నారు. ఇదిలా ఉండగా ఇక్కడి అడవులు సైతం అక్రమార్కులకు వరంగా మారుతున్నాయి. ఖానాపూర్, కడెం, మామడ, పెంబి, సారంగాపూర్‌తో పాటు జిల్లాకు అనుకొని ఉన్న బోథ్, నేరడిగొండల మండలాలకు చెందిన అడవులను క్రమంగా నరికివేస్తూ కలప అక్రమ రవాణా సాగిస్తున్నారు. సంవత్సరాల తరబడి చెట్ల నరికివేత, కలప రవాణా సాగుతున్నప్పటికీ సంబంధిత శాఖ మాత్రం చేతులెత్తేసిన రీతిలో ప్రవర్తించడం పట్ల సర్వత్రా విమర్శలు రేకెత్తిస్తున్నాయంటున్నారు. ఇందుకు తోడుగా జిల్లాలో కోట్లాది రూపాయలతో వివిధ శాఖలు చేపడుతున్న అభివృద్ధి పనుల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరుగుతున్నట్లు ఫిర్యాదులున్నాయి. పనుల్లో నాణ్యత లేకపోవడం, అంచనాలు తలకిందులవ్వడం షరా మామూలుగా మారిందంటున్నారు. దీనంతటికి రాజకీయ ప్రమేయం విస్తరించటడం ప్రధాన కారణమన్న ఆరోపణలున్నాయి. సర్కారు ఆస్తులు కాపాడి తమ బాధ్యతలు నిర్వర్తించాల్సిన సంబంధిత అధికార వ్యవహార శైలిపై కూడా అనుమానాలు తలెత్తుతున్నాయంటున్నారు.

మాఫియాను మరిపిస్తున్న ఇసుక దందా..

నిర్మల్ జిల్లాలో మాఫియా తరహాలో ఇసుక దందా సాగుతున్నట్లు ఆరోపణలున్నాయి. నిర్మల్, భైంసా, ఖానాపూర్ ప్రాంతాల్లోని ప్రధాన వాగులు, కాలువల్లో లభిస్తున్న ఇసుకనే కాకుండా పొరుగు జిల్లా, రాష్ట్రాల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. వాగులు, కాలువలను ఆనుకొని ఉన్న గ్రామలకు చెందిన వీడీసీలు వీటికి అనధికార టెండర్లను నిర్వహిస్తూ ఇసుక తవ్వకాలకు అనుమతులిస్తూ సమాంతర వ్యవస్థను నడుపుతున్నాయంటున్నారు. జిల్లా అంతటా ఇసుక డంప్‌లు కుప్పలు తెప్పలుగా బహిరంగంగానే కనిపిస్తున్నాయంటే పరిస్థితి ఎంత దిగజారిందో అర్థం చేసుకోవచ్చు. రెవెన్యూ, పోలీసు యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగానే ఇసుక అక్రమ దందా హద్దులు మిరుతుందంటున్నారు. ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు సాగిస్తుండడంతో భూగర్భ జలాల మట్టం క్రమంగా అడుగంటిపోతుంది. ఇతర కారణాలకు తోడుగా ఇసుక తవ్వకాల కారణంగా భూగర్భ జలమట్టం గతం కన్నా మూడున్నర మీటర్ల లోతులోకి పడిపోవడం గమనార్హం. ప్రస్తుతం జిల్లా అంతటా కొనసాగుతున్న అక్రమ ఇసుక దందా లక్షల రూపాయల్లో సాగుతున్నట్లు పేర్కొంటున్నారు. అయితే ఈ భారీ తంతు వెనక రాజకీయ నేతల అండదండలున్నాయన్నది బహిరంగ రహస్యమే. పోలీసులు, రెవెన్యూ అధికారులు, ఇసుక తవ్వకాలు, తరలింపును అడ్డుకునే ప్రయత్నాలు చేస్తే అక్కడ వెంటనే రాజకీయ ఒత్తిడుల ప్రభావం చూపుతాయంటున్నారు.

ఊరూరా బెల్ట్ షాపులు..

సర్కారు ఆదాయానికి, ప్రజల ప్రాణాలకు శాపంగా మారుతున్న మద్యం బెల్ట్ షాపులు ఊరూరా కొనసాగుతున్నాయంటున్నారు. ఈ బెల్ట్ షాపులు లైసెన్సు మద్యం దుకాణాల మద్య మాదిరిగానే కాకుండా మినీ బార్‌ను తలపించే విధంగా ఏర్పాటు చేస్తున్నారు. కొంత మంది మద్యం వ్యాపారులు, రాజకీయ నాయకులు సిండికేట్‌గా ఏర్పడి బెల్ట్ షాపులను ఏర్పాటు చేస్తున్నారు. అయితే స్థానిక వీడీసీలు ఈ బెల్ట్ షాపుల కోసం అనధికార వేలం పాటలు నిర్వహిస్తూ అనుమతులిస్తుండడం గమనార్హం. అయితే ఈ అక్రమ తంతు వ్యవహారం సంబంధిత అధికారులకు తెలిసిన వారు చూసి చూడనట్లు వ్యవహరిస్తుండడం అనుమానాలకు తావిస్తోంది. ముఖ్యంగా ఎక్సైజ్ అధికారులు పరోక్షంగా బెల్ట్ షాపులను ప్రోత్సాహిస్తున్నారంటున్నారు. అమ్మకాల టార్గెట్‌ను చెదించేందుకు కూడా వీరు బెల్ట్ షాపులకు సహకరిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఈ బెల్ట్ షాపుల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో యువత మద్యానికి బానిసలుగా మారి తమ ఆరోగ్యాలను గుల్ల చేసుకుంటున్నారంటున్నారు.

విస్తరిస్తున్న చెట్ల నరికి వేత, కలప రవాణా..

నిర్మల్ జిల్లాలో సరియైన నిఘా, గస్తీ, తనిఖీలు లేకపోవడంతో అడవుల నరికి వేత ఇష్టారాజ్యంగా సాగుతుందన్న ఆరోపణలున్నాయి. క్రమ క్రమంగా అడవుల విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోతుందంటున్నారు. చెట్లను నరికివేస్తూ ఆ కలపను నిర్భయంగా సరిహద్దులు దాటిస్తున్నారని ఫిర్యాదులున్నాయి. న్నారు. కొంతమంది అటవీ సిబ్బంది అండలతోనే ఈ కలప రాకెట్ సాగుతున్నట్లు ఫిర్యాదులున్నాయి.

అభివృద్ధి పనుల్లోనూ అక్రమాలు..

ప్రభుత్వం కోట్లాది రూపాయలతో చేపడుతున్న అభివృద్ధి పథకాల్లో పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు న్నాయి. అధికార పార్టీ నాయకులు, కాంట్రాక్టర్‌ల రూపంలో అవతరామెత్తి నాణ్యతకు తిలోదకాలిస్తూ, అధికారులపై ఒత్తిడిలు తెస్తూ ఈ అక్రమాలకు సూత్రదారులుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

[redacted] అవీ ఇవీ..

రైతుల ఆర్థికాభివృద్ధికి అధికారులు సహకరించాలి

▸▸ కలెక్టర్ డి. దివ్య



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ఆదిలాబాద్‌టౌన్,జనవరి3: ఆదిలాబాద్ జిల్లాలో ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తారని అందుకు రైతుల ఆర్థికాభివృద్ధికి అధికారులు సహకరించాలని జిల్లా కలెక్టర్ డి.దివ్య అన్నారు. తెలంగాణ వ్యవసాయ శాఖ ఉద్యోగుల సంఘం డైరీ, క్యాలెండర్, టేబుల్ క్యాలెండర్‌ను బుధవారం ఆమె కార్యాలయంలో ఉద్యోగులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమానికి అధికారులు కృషి చేయాలన్నారు. రైతు సమస్యలను తెలుసుకునేందుకు త్వరలో కిసాన్ మిత్ర కార్యాలయాన్ని ప్రారంభిస్తామన్నారు. ఇందులో జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఆశా కుమారి, తెలంగాణ వ్యవసాయ శాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.శివ కుమార్, జనరల్ సెక్రటరీ అశ్రఫ్, ఏడీఏలు పుల్లయ్య, రమేష్, గణేష్, ప్రమోద్, ఏవోలు సాగరిక, సంధ్యా, భాస్కర్ పాల్గొన్నారు.

'ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి'

ఆదిలాబాద్ క్రైం, జనవరి 3: పట్టణంలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని బుధవారం జిల్లా యువజన సంఘాల సమితి నాయకులు ఆదిలాబాద్ డీఎస్పీ కే. నరసింహా రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని పలు కూడళ్లలో ట్రాఫిక్ సమస్యలు ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. జాతీయ రహదారి పొడవున భారీ వాహనాలు నిలిపివేయడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఇందులో జిల్లా అధ్యక్షుడు బాల శంకర్ కృష్ణ, ఊరె గణేష్, లోకండే అనిల్, శశికాంత్, మసూద్ పాల్గొన్నారు.

'దళితులపై దాడులను అరికట్టాలి'

ఆదిలాబాద్ క్రైం, జనవరి 3: కేంద్ర ప్రభుత్వం దళితులపై దాడులను అరికట్టాని తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు మల్యాల మనోజ్ కుమార్ మాదిగ, నక్క రాందాస్ మాదిగ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ నెల 1న మహారాష్ట్రలోని భీమా కోరేగావ్‌లో శతాబ్ధి ఉత్సవాల్లో భాగంగా పిష్వాలకు, మహర్‌లకు జరిగిన పోరాటంలో మహర్‌లు 500 మంది చనిపోయిన వారికి నివాళులు అర్పించేందుకు వెళ్లిన వారిపై దాడులు చేయడం అన్యాయమన్నారు.

గర్భిణులకు భరోసా.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

▸▸ కేసీఆర్ కిట్‌తో పెరుగుతున్న ప్రసవాలు ▸▸ పీహెచ్‌సీకి అనుబంధంగా అమ్మ ఒడి వాహనం

బజార్‌హత్నూర్, జనవరి 3: ఆసుపత్రి ప్రసవాలకు కేరాఫ్‌గా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆర్యోగ కేంద్రం నిలుస్తుంది. ఆరోగ్యవంతమైన బిడ్డ జననం ఆసుపత్రిలో ప్రసవం కావాలని వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన అమ్మ ఒడి 102 వాహనం ద్వారా రవాణా సౌకర్యం ఉండడం, గర్భిణులను ఆసుపత్రులకు తీసుకురావడం, ఆసుపత్రిలో ప్రసవం చేయించి పాపను, బాలింతను మళ్లీ ఇంటికి చేర్చడం, పుట్టిన బిడ్డ, తల్లికి కేసీఆర్ కిట్ అందించడం, తల్లి గర్భం దాల్చిన నుంచి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేసుకొని ఆసుపత్రి డెలివరీ అయ్యేంత వరకు రాష్ట్ర ప్రభుత్వం పాప పుడితే రూ.13 వేలు, బాబు పుడితే రూ.12వేలను అందిస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలనెల ప్రసవాల సంఖ్య పెరుగుతోంది. నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంతంలో గర్భిణులకు ఉప కేంద్రాల ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది గర్భిణులకు అవగాహన కల్పించడంతో నెలలో 25 ప్రసవాలు అవుతున్నాయి. ఒకప్పుడు ప్రభుత్వ వైద్యమంటే ఆమడ దూరంలో ఉండే మండల ప్రజలు నేడు ప్రభుత్వ ఆసుపత్రికి క్యూ కడుతున్నారు. మండలంలో 28 వేల జనాభాకు మండల కేంద్రంలో ఒకే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. బజార్‌హత్నూర్, పిప్రి, టెంబి, గోకొండ, భూతాయి గిర్నూర్; జాతర్ల గ్రామాల్లో 7 సబ్ సెంటర్లు ఉన్నాయి. అధునాతన హంగులతో ఆసుపత్రి భవనం, ల్యాబ్‌లు, ప్రసూతి గదులు, ఫార్మా స్టోర్ రూమ్, సిట్టింగ్ రూమ్, సిబ్బంది నివాస గృహాలు, అన్ని వసతులతో భవన నిర్మాణం ఏర్పాటు కావడంతో కార్పొరేట్ ఆసుపత్రిని తలపిస్తోంది. 24 గంటల ప్రసూతి సేవలు, ఇద్దరు వైద్యులు, స్టాఫ్ నర్సులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండడం, అమ్మ ఒడి 102 వాహనంతో పాటు ప్రభుత్వమే రవాణా ఖర్చులను భరిస్తుంది. ప్రభుత్వ ఆసుపత్రిలపై నమ్మకం పెరగడం శుభపరిణామ మని వైద్యులు పేర్కొంటున్నారు.



అధునాతన సౌకర్యాలతో ప్రసూతి గది

ప్రసవాల సంఖ్య పెరిగింది..



గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది గర్భిణులకు అవగాహన కల్పించడంతో నెలల 20కి పైగా ప్రసవాలు అవుతున్నాయి.

డా. హరీష్, మెడికల్ ఆఫీసర్

మెరుగైన సౌకర్యాలు ఉన్నాయి..



రాష్ట్ర ప్రభుత్వం ఆసుపత్రి ప్రసవాలను ప్రోత్సహించుటకు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించింది. ఆసుపత్రిలో మెరుగైన సౌకర్యాలు ఉన్నాయి.

- కిరణ్ కుమార్, మెడికల్ ఆఫీసర్

ప్రభుత్వ ఆసుపత్రిపై నమ్మకం ..

బజార్‌హత్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య సేవలు లభించడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రిపై నమ్మకం పెరిగింది. గ్రామంలోని ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు చెప్పడం ప్రతీ నెల 9న ఇక్కడ పరీక్షలు చేయించుకుంటున్నాం.

- కౌసల్య బాయి, హర్కాయి

ఉగాదిలోగా వెయ్యి 'డబుల్' ఇళ్ల గృహ ప్రవేశం

▸▸ రాష్ట్ర హౌసింగ్ చైర్మన్ మడపు భూమారెడ్డి

ఆదిలాబాద్‌టౌన్, జనవరి 3: జిల్లాలో నిర్మాణంలో ఉన్న వెయ్యి డబుల్ బెడ్ రూం ఇళ్లల్లో ఉగాదిలోగా గృహ ప్రవేశం చేసేలా చూస్తామని రాష్ట్ర హౌసింగ్ చైర్మన్ మడపు భూమారెడ్డి అన్నారు. బుధవారం జిల్లాకు వచ్చిన ఆయన స్థానిక ఆర్‌అండ్‌బి విశ్రాంతి భవనంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు డబ్బులు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. అప్పుడు జరిగిన అవినీతి అక్రమాల దృష్ట్యా రాష్ట్ర వ్యాప్తంగా హౌసింగ్ శాఖను తీసి వేయడం జరిగిందని దీంతో అందులో పని చేసే ఉద్యోగులను ఇతర శాఖల్లో సర్దుబాటు చేశామన్నారు. కానీ జిల్లాలో అర్హులైన నిరుపేదలకు మంజూరు చేసిన డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలు ముగింపు దశకు వచ్చాయని అన్ని విధాల సౌకర్యాలతో జిల్లా వ్యాప్తంగా ఉగాదిలోగా పూర్తి చేసి గృహ ప్రవేశం చేయడం జరుగుతుం దని వివరించారు. ప్రస్తుతం నత్తనడకన కొనసాగుతున్న డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి గడువు లోగా లబ్ధిదారులకు అందేలా చూడాలని కోరారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు జిల్లాలోని జైనథ్ మండలంలో నత్తనడకన కొనసాగుతున్న డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలను పరిశీలించడం జరుగుతుంన్నారు. ఇందులో ఆర్‌డబ్ల్యుఎస్, ఆర్‌అండ్‌బీ ఈఈలు, అధికారులు పాల్గొన్నారు.



రాష్ట్ర హౌసింగ్ శాఖ చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

అర్హులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు..

జైనథ్, జనవరి 3: రాష్ట్రంతో పాటు జిల్లా అర్హులైన వారందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించి ఇస్తామని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ భూమారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం ఇళ్లను ఆయన పరిశీలించారు. స్థానిక లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో టీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, కాంట్రాక్టర్‌లు శ్రద్ధ వహించి నాణ్యతతో ఇళ్లను నిర్మించాలని సూచించారు. లబ్ధిదారులను పారదర్శకంగా వ్యవహరించి అర్హులను ఎంపిక చేయాలని సూచించారు. ఇందులో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రౌతుమనోహర్, టీఆర్‌ఎస్ యువ నాయకులు జోగు మహేందర్, జైనథ్ ఆలయ కమిటీ చైర్మన్ లింగారెడ్డి, నాయకులు టి.చంద్రయ్య, పి.గణేష్‌యాదవ్, లస్మన్న, పోతారెడ్డి, అధికారులు పాల్గొన్నారు..

'కేంద్ర మంత్రి పదవికి రాందాస్ రాజీనామా చేయాలి'

ఆదిలాబాద్‌టౌన్, జనవరి 3: మహారాష్ట్రలోని భీమకోరేగావ్‌లో దాడికి గురైన దళితులకు మద్దతుగా నిలువలని నిందితులను శిక్షించే విధంగా బీజేపీ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అంతేకాకుండా కేంద్ర మంత్రి పదవికి రాందాస్ రాజీనమా చేయాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి మేకల మధుకర్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్రలో దళితులపై దాడులు జరుగడం సరైంది కాదని వివరించారు. ఈ ఘటనకు వెంటనే బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రభుత్వం దళితులకు వ్యతిరేకంగా విధానాలను కొనసాగిస్తూ బౌద్ధిజాన్ని నిర్మూలించేందుకు మనువాద పద్ధతులను పాటిస్తుందని ఆరోపించారు. అందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలకు బీజేపీ పార్టీకి వ్యతిరేకంగా నిలబడి బీఎస్పీ పార్టీని 2019లో బీఎస్పీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి జాదవ్ ప్రహ్లాద్, అసెంబ్లీ అధ్యక్షుడు బాంకెరాజు, అసెంబ్లీ కోశాధికారి చౌహన్, అజయ్, పార్టీ కార్యకర్తలు సాయిరాం, తరుణ్, నవీన్, సుల్తాన్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలి

జ ▸▸ కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకుల ధర్నా

ఆదిలాబాద్‌టౌన్, జనవరి 3: గత 24 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని బుధవారం జిల్లా కలెక్టర్ ఎదుట ధర్నా నిర్వహించారు. రాష్ట్ర సంఘం పిలుపులో భాగంగా అన్ని మండల కేంద్రాలతో పాటు జిల్లా కేంద్రంలో ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నామని సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీన్ పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వర్గీకరణపై అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావాలని డిమాండ్ చేశారు. ఇందులో భాగంగానే చెప్పు, డప్పు కార్మికులకు రూ.2వేలు పింఛన్ ఇవ్వాలని కోరారు. అంత వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇందులో ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అంధులకూ ఉందో లిపి..

సప్త వర్ణాలు ఎలా ఉంటాయో వారికి తెలియదు.. కానీ కోపంతో ఉంటే ఎరుపు వర్ణం, శాంతంగా ఉంటే తెలుపు వర్ణం అని వారికి తెలుసు. అందరూ కళ్లతో చూస్తే వారు మాత్రం మనసుతో చూస్తారు. అదే వారి మనోనేత్రం. అమావాస్య చీకటిలాంటి అంధకారంలో మగ్గుతున్న అంధుల జీవితాల్లో పున్నమి వెలుగులు పూయించిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ. చూపు లేని వారి కోసం ప్రత్యేక లిపి తయారు చేసి, వారి జ్ఞానసముపార్జన బాటలు వేసిన ఆయన జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం..

◆ మంచిర్యాల అర్బన్



బ్రెయిలీ లిపి ద్వారా చదువు నేర్చుకుంటున్న అంధులు

నేడు లూయిస్ బ్రెయిలీ జయంతి

● అంధుల ఆరాధ్య దైవం..

అంధుల ఆరాధ్య దైవం లూయిస్ బ్రెయిలీ 1809 జనవరి 4న ఫ్రాన్స్ రాజధాని పారీస్ సమీపంలోని కూవ్రే అనే గ్రామంలో మానిక్యూ బ్రెయిలీ, సైమన్ రెనే బ్రెయిలీ దంపతులకు జన్మించారు. తండ్రి గుర్రపుశాలలో పని చేస్తూ, వాటికి అవసరమయ్యే తోలువస్తువులను తయారు చేసేవారు. లూయిస్ తన మూడేళ్ల వయస్సులో తండ్రి వెంట వెళ్లి, ఆయన లేని సమయంలో పని ముట్లతో ఆడుతుండగా, కంటికి గాయమైంది. తర్వాత గాయమైన కంటికి వ్యాధి సోకి, రెండు కళ్లకూ వ్యాపించి పూర్తిగా అంధుడయ్యారు. అక్షరాలు చదవలేని లూయిస్‌ను తండ్రి పారీస్‌లోని 'నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ బ్లైండ్ యూత్' పాఠశాలలో చేర్పించారు. చార్లెస్ బార్బియర్ అనే సైనిక ఉద్యోగి నిరక్షరాస్యులైన సైనికులకు సందేశాలు చేరవేసేందుకు రూపొందించిన సిరాచుక్కల అక్షరాల పద్ధతిని వీరి పాఠశాలలో ప్రవేశపెట్టారు. బార్బియర్ తయారు చేసిన లిపి ఆధారంగా ఆరు చుక్కలతో



లూయిస్ బ్రెయిలీ

కూడిన లిపిని అంధులకు అనుకూలంగా బ్రెయిలీ తయారు చేశాడు. ఈ అక్షర క్రమం అచ్చులో కాకుండా చేతి స్పర్శ ద్వారా తెలుసుకోగలిగేలా ఉంటుంది. చుక్కల రూపంలో ఉన్న ఈ బ్రెయిలీ లిపి కొద్ది రోజుల్లోనే ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది. లూయిస్ బ్రెయిలీ తన 20వ ఏట చదువుకున్న పాఠశాలలోనే ఉపాధ్యాయునిగా వృత్తి జీవితం ప్రారంభించారు. అనంతరకాలంలో క్షయవ్యాధి బారిన పడిన బ్రెయిలీ 1852 జనవరి 6న మరణించారు.

● జిల్లాలో 500కు పైగా అంధులు..

మంచిర్యాల జిల్లాలో 500 మందికి పైగా అంధులున్నారు. వీరికి ప్రభుత్వం తరుపున ఎలాంటి ప్రత్యేక పాఠశాలలు లేవు. మంచిర్యాల పట్టణంలో ఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏడేళ్లుగా 'సాయి అంధుల పాఠశాల' కొనసాగుతున్నది. దాతల సహాయంతో నిర్వహిస్తున్న ఈ పాఠశాలలో ప్రస్తుతం 25 మంది అంధ విద్యార్థులు ఉచిత విద్య, వసతి పొందుతున్నారు. చదువుతోపాటు సంగీతం, నృత్యం, వాయిద్యం, మెగా మెడిటేషన్, కరాటే, అబాకస్, కంప్యూటర్‌తో పాటు వివిధ ఆటల్లో శిక్షణ ఇస్తున్నారు.

● సత్తాచాటుతున్న విద్యార్థులు

ఇక్కడి అంధ విద్యార్థులు వివిధ రాష్ట్ర, జాతీయస్థాయి సాంస్కృతిక పోటీల్లో సత్తా చాటుతున్నారు. ఇప్పటివరకు వివిధ సంగీత, నృత్యపోటీల్లో అనేక అవార్డులు గెలుచుకున్నారు. డిసెంబర్24న వరంగల్‌లో జరిగిన శాస్త్రీయ నృత్య పోటీల్లో ప్రథమ బహుమతి గెలుచుకోవడమేగాక 'తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్', 'తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు సంపాదించారు.



తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డు సాధించిన అంధుల పాఠశాల విద్యార్థులు



స్పర్శద్వారానే చదువు..

-శిరీష. పిప్పల్‌పోటీ, ఆదిలాబాద్ జిల్లా

లూయిస్ బ్రెయిలీ మా ఆరాధ్య దైవం. ఆయన రూపొందించిన లిపి ఆధారంగా కేవలం స్పర్శ జ్ఞానంతో చదవగలుగుతున్నాం. కంటి చూపు లేకున్నా బాధలేదు. మేము ఎవరికీ తీసిపోం అనే సానుకూల దృక్పథంలో ముందకుపోతున్నాం. మా పాఠశాల నిర్వాహకులు మమ్మల్ని అన్నివిధాలా ప్రోత్సహిస్తున్నాం.



కళ్లు లేవనే బాధలేదు..

-రజిత, మంచిర్యాల

నాకు కళ్లు లేవని ఏనాడూ బాధపడ లేదు. మా తల్లిదండ్రులు నన్ను ఇలాంటి మంచి పాఠశాలలో చేర్పించారు. అదే నాకు పదివేలు. నాకు ఎంతో ఆనందంగా ఉంది. చదివేది 3వ తరగతి అయినా 30 ఎక్కాలు చెప్పగలను. భగవద్గీత చదవగలను. డ్యాన్స్ చేయగలను. అన్నింటా ముందుంటాను.



ఉద్యోగమే లక్ష్యంగా..

-రాజేందర్, బుట్టాపూర్, నిర్మల్ జిల్లా

బ్రెయిలీ రూపొందించిన లిపిలో 6 చుక్కల సాయంతో తెలుగు, ఇంగ్లీష్ భాషలను చక్కగా నేర్చుకుంటున్నాం. అందరిలాగే మేము కూడా చదవడం, రాయడం చేస్తున్నాం. బ్రెయిలీలా బాగా చదువుకొని మంచి ఉద్యోగం సాధిస్తాను.



అంధులను ఆదుకోవడమే లక్ష్యం...

- అశోక్‌రావు, అంధుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు

దైవం చిన్నచూపు చూడడంతో అంధులుగా జన్మించిన వీరిని ఆదుకోవడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాము. ఇందుకు దాతలు పెద్దమనసుతో సహకరిస్తున్నారు. వారందరికీ నా కృతజ్ఞతలు. ప్రభుత్వం కూడా అంధ విద్యార్థులపై దృష్టి సారించాలి. వీరి కోసం ప్రతి జిల్లాలో తప్పనిసరిగా ఒక పాఠశాల ఏర్పాటు చేయాలి.

కోట్లు పెట్టి కొన్నా.. ఫలితం సున్నా!

ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో పూర్వ ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని 45 ఆశ్రమ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సోలార్ వాటర్ హీటర్లు నిరుపయోగంగా మారాయి. సమగ్ర కార్యచరణ పథకం(ఐఏపీ) కింద రూ.1.45 కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన పరికరాలు కొన్నిరోజులకే దెబ్బతినగా, మరమ్మతులు చేయించేవారు కరువయ్యారు. ఫలితంగా విద్యార్థులు చల్లని నీటితో వణుకుతూ స్నానాలు చేస్తున్నారు.

◆ ఉట్నూర్



గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన సోలార్ వాటర్ హీటర్లు

- నిరుపయోగంగా సోలార్ వాటర్ హీటర్లు
- మరమ్మతులు పట్టని అధికారులు
- వేన్నీళ్ల స్నానానికి నోచుకోని ఆశ్రమ విద్యార్థులు


పూర్వ ఆదిలాబాద్ జిల్లా పరిధిలో శీతాకాలంలో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. దీంతో ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు ఉదయంపూట చన్నీటి స్నానాలు చేయడం కష్టంగా ఉండేది. వణుకుతో చాలా మంది జ్వరాల బారినపడేవారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో 45 ఆశ్రమ పాఠశాలల్లో సోలార్ వాటర్ హీటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం 2016లో సమగ్ర కార్యచరణ పథకం(ఐఏపీ) కింద రూ.1.45 కోట్లు వెచ్చించి, సోలార్ వాటర్ హీటర్లు కొనుగోలుచేసి అందించింది. వీటిని వన్‌వట్, సైయొద్‌పూర్, ఝరిపూనగూడ, అందర్‌బంద్, తిర్యాణి,మానిక్యపూర్, పంగిడి మదారం, రోంపల్లి, బంబారా, జాతర్ల, పాట్నాపూర్, పార్డీ(బి), రాయిగూడ, రిమ్మ, కుంటాల, కోర్నికల్(కే), మార్లవాయి, పోచంలొద్ది, జైనూర్‌పాట్నాపూర్, అనార్‌పల్లి, కెరమెరి, రాంజీగూడ, కోహినూర్(కే), కంచన్‌పల్లి, పంగిడి, సల్గుపల్లి, ఖేతిని, ఉమ్రిగూడిహత్నూర్, ఉమ్రి(టి), ఉట్నూర్, వాంకిడి, అర్జుని, బెజ్జూర్, ఇంద్రవెల్లి, సాలేగూడ, సోమిని, స్వర్ణ, అర్జునికొలాంగూడ, పోతగూడ, సాలేగూడ, చిత్తగూడ, బాబేఝరి, గౌరి, జోడేఘాట్, లోకారి, నార్నూర్ తదితర పాఠశాలల్లో ఏర్పాటుచేశారు. కొన్నిరోజులు బాగానే పనిచేసినా తర్వాత రిపేరుకు వచ్చాయి. వాటికి మరమ్మతులు చేయించకపోవడంతో నిరుపయోగంగా మారాయి. దీంతో విద్యార్థులకు చన్నీటి స్నానాలతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, సోలార్ వాటర్‌హీటర్లకు మరమ్మతులు చేయించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.



నిరుపయోగంగా నీటి ట్యాంకులు

ఉన్నతాధికారులకు నివేదించాం

- రమేష్, ఈఈ ఐటీడీఏ, ఉట్నూర్



పూర్వ ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని 45 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో సోలార్ వాటర్ హీటర్లను ఏర్పాటు చేశాం. ఇవి కొన్నిచోట్ల పని చేయడం లేదని మా దృష్టికి వచ్చింది. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదిక అందజేశాం. నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేయిస్తాం.

మేడ మీద మేటి ఎవుసం

ప్రముఖ రచయిత అల్లం రాజయ్య కలం సాగే కాదు, కూరగాయల సాగులోనూ శభాష్ అనిపించుకుంటున్నారు. కాకపోతే ఆయన వ్యవసాయం చేస్తున్నది మేడ మీద. కేవలం 300 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇంటికి కావాల్సిన కూరగాయలు, పండ్లను పండిస్తున్నారు. అదీ పూర్తి సేంద్రియ పద్ధతిలో! నాలుగేళ్లుగా బయట నుంచి ఎలాంటి కూరగాయలూ కొనుగోలు చేయలేదని చెబుతున్నారు.

◆ ఆంధ్రజ్యోతి, మంచిర్యాల



వంకాయ మొక్కలకు నీరు పడుతున్న అల్లం రాజయ్య

- ప్రముఖ రచయిత అల్లం రాజయ్య ఆదర్శం
- నాలుగేళ్లుగా ఇంటిపై కూరగాయలు, పండ్ల సాగు
- పూర్తిగా సేంద్రియ ఎరువుల వాడకం
- ఇంటి అవసరాలు తీరడంతోపాటు మానసికోల్లాసం

● పూర్తిగా సేంద్రియ పద్ధతిలో..

ప్రస్తుతం మార్కెట్‌లో దొరుకుతున్న కూరగాయలను విచ్చలవిడి రసాయన ఎరువులు, పురుగు మందుల సాయంతో పండిస్తున్నారు. ఆరోగ్యానికి ఇవి ఏమాత్రం మంచివి కావు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన రచయిత రాజయ్య, ఇందుకు ప్రత్యామ్నాయం ఆలోచించారు. తన అనుభవాన్ని రంగరించి, 'మేడ మీది ఎవుసం' మొదలుపెట్టారు. తన సొంతింటి మేడ మీద 300 చదరపు అడుగుల విస్తీర్ణాన్ని ఇందుకు ఉపయోగించుకోవాలని భావించారు. సిమెంట్ ఇటుకల సాయంతో 6/3 అడుగుల ఆరు తొట్టిలు, 4/6 అడుగుల రెండు తొట్టిలు, 3/3 అడుగుల నాలుగు తొట్టిలు ఏర్పాటుచేయించారు. కింద డాబాకు అంటకుండా నీరు ఇంకిపోయే ఏర్పాటు చేశారు. ఒండ్రు, ఎర్రమట్టిని ప్రత్యేకంగా తెప్పించి, తొట్లలో నింపారు. ఆయా తొట్లలో పూర్తిగా సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, పండ్ల మొక్కలు సాగుచేస్తున్నారు. మేకలు, గొర్రెల ఎరువు, పేడ, వర్మీకంపోస్టును మాత్రమే కొద్ది మోతాదులో వాడుతున్నారు. ప్రస్తుతం ఇక్కడ బీర, సోర, కాకర, చేమగడ్డ, నాలుగు రకాల చిక్కుళ్లు, టమాట, వంకాయ, బెండ, గోబీ, పాలకూర, తోటకూర, బచ్చలి, కొత్తమీర, మెంతి, పూదీనా, ఉల్లి లాంటి కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నారు. పలు కుండీల్లో పెట్టిన పాల సపోటా, బత్తాయి, నిమ్మ, దానిమ్మ, అంగూర, బొప్పాయి, మునగ చెట్లు కాపుకొచ్చాయి. వీటితో పాటు గులాబీ మల్లె, చామంతి, బంతి, వెదురు, పలు ఔషధ మొక్కలు, తిప్పతీగ, వివిధ రకాల అడవి మొక్కలు కనువిందుచేస్తున్నాయి. తొట్టిల ఏర్పాటు, మొక్కల కొనుగోలు కోసం ఇప్పటివరకు రూ.40వేలు ఖర్చు చేసినట్లు రాజయ్య చెప్పారు. అది మినహా ఆ తర్వాత పెద్దగా పెట్టుబడి ఏమీ ఉండదన్నారు. మొక్కలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న రాజయ్య, వాటికి నీరుపట్టడం, కూరగాయలు తెంపడంలాంటి పనులతో శరీరానికి కాస్త వ్యాయామం, మానసిక ఉల్లాసం కలుగుతున్నాయని స్పష్టం చేశారు.



తొట్టిలో బత్తాయి చెట్టు



తొట్టిలో తోటకూర



తొట్లలో పలు కూరగాయల మొక్కలు



నాలుగేళ్లుగా ఇంటి పంటే..

-అల్లం రాజయ్య

మేడ మీది ఎవుసం బాగున్నది. నాలుగేళ్లుగా స్వయంగా పండించిన కూరగాయలు, పండ్లనే వినియోగిస్తున్నాం. ఎప్పుడైనా బయట టమాట, మిర్చి తప్ప బయట నుంచి కూరగాయలు కొన్నది లేదు. మా కుటుంబానికి సరిపోగా మిగిలిన కూరగాయలను చుట్టుపక్కల వారికి పంచుతుంటాం. మొదట్లో రూ.40వేలు పెట్టుబడి పెట్టాను. ఆ తర్వాత ఎలాంటి ఖర్చు ఉండదు. మేకల, గొర్రెల ఎరువు, పేడను తక్కువ మోతాదులో వినియోగిస్తే సరిపోతుంది. రోజూ ఒక పూట నీరు పట్టాల్సి ఉంటుంది. తీగరకాల కూరగాయలు బాగా కాస్తున్నాయి. సేంద్రియ ఎరువులు మాత్రమే వాడడం వల్ల కూరగాయలు, పండ్లు చాలా తాజాగా, రుచిగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి ఎంతో మంచివి.

నోరు తిరుగుతోందా?

How can a clam cram in a clean cream can?

సామెత


శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు

ఒకటికి మూడు

చిత్రంలో కనిపిస్తున్న దాన్ని తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో ఏమంటారంటే..!

1.కొంగ
2.CRANE
3 बगुला

రంగులు వేయండి



పండగ సమయాల్లో వీధులు, పార్కులను కళ్లు మిరుమిట్లుగొలిపే లైట్లతో అలంకరించుకోవడం మనకు తెలుసు. కానీ ఫ్రెంచ్ రివెరాలో మాత్రం నిమ్మకాయలతో, నారింజ పండ్లతో పార్కులన్నీ అలంకరించి పండుగ చేసుకుంటారు. ఏటా అక్కడ జరిగే లెమన్ ఫెస్టివల్ కోసం ఇలా చేస్తుంటారు. ఈ ఫెస్టివల్‌ను చూడటానికి కొన్ని లక్షల మంది పర్యాటకులు అక్కడికి వెళ్తుంటారు.

కనువిందు చేసే లెమన్ ఫెస్టివల్





ఫ్రాన్స్‌లో జరిగే ముఖ్యమైన పండుగల్లో ఈ లెమన్ ఫెస్టివల్ ఒకటి. ఫార్ములా గ్రాండ్ 1 తరువాత ఫ్రెంచ్ రివెరాలో జరిగే రెండో అతి పెద్ద ఈవెంట్ ఈ లెమన్ ఫెస్టివల్. ప్రతి ఏటా ఫిబ్రవరిలో జరిగే ఈ వేడుకకు సుమారు 2 లక్షల 50 వేల మంది సందర్శకులు హాజరవుతారు. ఈ పండుగ ఈ మధ్య పుట్టిందేమీ కాదు. 1928 నుంచి ఈ ఫెస్టివల్‌ను జరుపుకుంటున్నారు. ఫిబ్రవరి 11 నుంచి మార్చి 1 వరకు జరిగే ఈ వేడుక కోసం కొన్ని వేల మంది కార్మికులు శ్రమించి పార్కులు, ఇతర ముఖ్యమైన స్థలాలన్నింటినీ అందంగా తీర్చిదిద్దుతారు. ఇందుకోసం 120 టన్నుల నిమ్మ పండ్లను ఉపయోగిస్తారట. నిమ్మ పండ్లు మాత్రమే కాకుండా ఆరెంజ్, గ్రేప్‌ఫ్రూట్ వంటి సిట్రస్ జాతికి చెందిన పండ్లను కూడా వాడతారు. అయితే ఎక్కువగా నిమ్మపండ్లే కనిపిస్తాయి. ఇలా అలంకరించిన పార్కులను చూడటానికి సందర్శకులను అనుమతిస్తారు. అత్యంత సుందరమైన తీర ప్రాంతం కలిగిన ఈ పట్టణాన్ని లెమన్ ఫెస్టివల్ జరిగే సమయంలో సందర్శించడానికి పర్యాటకులు ఆసక్తి చూపుతారు.

గోల్డెన్ ఫ్రూట్ పరేడ్

నారింజపండ్లు, నిమ్మపండ్లు రోడ్డుపై నీటివరదలా జారుకుంటూ వస్తే ఎలా ఉంటుంది? ఈ దృశ్యం చూడాలంటే గోల్డెన్ ఫ్రూట్ పరేడ్ చూడాల్సిందే. లెమన్ ఫెస్టివల్ జరిగే రోజుల్లో ప్రతి ఆదివారం మధ్యాహ్నం ఈ పరేడ్ నిర్వహిస్తారు. జానపద బృందాలు చేసే నృత్యాలు, అభిమానుల కోలాహలంతో ఈ పరేడ్ కన్నుల పండువగా ఉంటుంది. చివరి ఆదివారం రోజున పెద్ద ఎత్తున బాణసంచా కాలుస్తారు. గురువారం రోజుల్లో పరేడ్ రాత్రివేళ ఉంటుంది. ఈ ఫెస్టివల్‌ను మెంటన్ లెమన్ ఫెస్టివల్ అని కూడా అంటారు. ఎందుకంటే మెంటన్‌లోనే నిమ్మపండ్లు ఎక్కువ పండుతుంటాయి. మెంటన్ ఒక చిన్న పట్టణం. నైస్ పట్టణానికి 30 కి.మీల దూరంలో ఉంటుంది. ఇది యూరప్‌లో అత్యధికంగా నిమ్మపండ్లను పండిస్తున్న ప్రదేశంగా గుర్తింపు పొందింది.



పద్యం

నిక్కమైన మంచినీలమొక్కటి చాలు
తళుకు బెళుకు రాళ్లు తట్టెడేల
చాటుపద్యమిలను చాలదా ఒక్కటి?
విశ్వదాభిరామ వినురవేమ

భావం : జాతిరత్నం విలువ ఎన్నటికీ పూత అద్దిన రాళ్లకు రాదు. పనికిరాని వేల కవితల కన్నా మంచి నీతిని చాటే పద్యం ఒక్కటి చాలు.

జనరల్ నాలెడ్జ్

చంద్రునిపై కాలుపెట్టిన మొదటి వ్యక్తి ఎవరు?

సూక్తి

లేని గొప్పతనం ప్రదర్శిస్తే నీలో ఉన్న నిజమైన గొప్పతనం మరుగున పడిపోతుంది.

- గౌతమ బుద్ధుడు

చుక్కలు కలపండి



జంబ్లింగ్ వర్డ్స్

ఈ కింది పదాలను సరిచేయండి

1. ENHUR ▸..............
2. NDGAIH ▸..............
3. AKTIL ▸..............
4. HAGKLOE ▸..............
5. AADZ ▸..............

జవాబులు

జంబ్లింగ్ వర్డ్స్ :
1. NEHRU
2. GANDHI
3. TILAK
4. GOKHALE
5. AZAD

జనరల్ నాలెడ్జ్ :
నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్

పొడుపు కథ :
అరుగు

నేర్చుకుందాం! Anger = కోపం


పొడుపు కథ

ఎందరు ఎక్కినా విరగని మంచం

మంచి మాట

అత్తరు దుకాణానికి వెళితే అక్కడ మనమేమీ కొనకపోయినా కొంత పరిమళాన్ని గ్రహిస్తాం.
ఉత్తముల సాహచర్యమూ అంతే!..

బొమ్మ గీయండి



